ప్రజాశక్తి
మంగళవారం 4 నవంబర్ 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

పంటనష్టం అంచనాల్లో

భారీగా కోత

- రైతులకు శరాఘాతంగా ప్రభుత్వ మార్గదర్శకాలు
- ఈ-క్రాప్ లేక పలువురికి దక్కని ప్రభుత్వ సాయం
- లేత పంటలకు నమోదులో మినహాయింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నడు జిల్లాల్లో మొంథా తుపానుతో వ్యవసాయ, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అయితే నష్టం వివరాల నమోదులో ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలు రైతులకు శరాఘాతంగా మారాయి. 33 శాతానికిపైగా పంట నష్టం జరిగితేనే నష్టం వివరాలను నమోదు చేస్తారు. లేదంటే నష్ట పరిహారం దక్కదు. ప్రధానంగా ఈ-క్రాప్ నమోదు చేసుకోని రైతులకు పంట నష్టం జరిగినా నమోదును మినహ యిస్తున్నారు. పల్నాడు జిల్లాలో గత నెల 30వ తేదీ వరకు కేవలం 87 శాతం మందికి ఈ-క్రాప్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. కొన్ని మండలాల్లో 80 శాతం లోపే నమోదైంది. నమోదవ్వని రైతులు, కౌలు రైతులకు చెందిన పొలాలు ముంపునకు గురైనా పరిహారం వచ్చే అవకాశం లేదు. వరి పంటకు సంబంధించి పరిహారం తీసుకుంటే భవిష్యత్తులో అదే పొలంలో దిగుబడి వస్తే ఈ ధాన్యాన్ని రైతుల నుంచి తాము కొనుగోలు చేయబోమని ప్రభుత్వం పేర్కొంది. దీంతో రైతులకు పరిహారం తీసుకోవాలా? లేదా వచ్చినంత మేరకు ధాన్యం విక్రయించుకోవాలా అని తర్జన భర్జనలు పడుతున్నారు.



గుంటూరు జిల్లా కొల్లిపర మండలంలో తుపాను వల్ల నేలకొరిగిన వరి

గుంటూరు జిల్లాలో తొలుత 60 వేల ఎకరాల్లో వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. 140 గ్రామాల్లో 20,534 మంది రైతులకు చెందిన 33 వేల ఎకరాల్లో వరి, 90 గ్రామాల్లో 11,421మంది రైతులకు చెందిన 23 వేల ఎకరాల్లో పత్తి, 48 గ్రామాలకు చెందిన 2161 మంది రైతులకు చెందిన 3800 ఎకరాల్లో అపరాల పంటలు దెబ్బతిన్నాయని అధికారులు తొలుత అంచనాలు రూపొందించారు. కానీ వెంటనే రెండు రోజుల వ్యవధిలో తుది అంచనాలలో ఈ నష్టం వివరాల

2లో



కలెక్టరేట్ ఎదుట నిరసనలో సంఘాల నాయకులు

నష్టం జాబితాలో కౌల్దార్ల పేర్లు రాయండి

- పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల ఆదేశం
- కౌలురైతు సంఘం ఇచ్చిన వినతిపై నాయకుల సమక్షంలో అధికారులతో చర్చలు
- జాబితాలను సచివాలయం, రైతుసేవ కేంద్రాల వద్ద పెడతామని ప్రకటన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సాగుదారులలో 70 శాతం పైగా ఉన్న కౌలురైతులను ఆదుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఎపి కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రామారావు, వై.రాధాకృష్ణ విమర్శించారు. కౌలురైతుల అన్నదాత సుఖీభవ పెట్టుబడి సహాయం ఒకేసారి అందజేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో నరసరావుపేటలోని కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించగా ఈ అంశాలపై నాయకుల సమక్షంలోనే వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ చర్చించారు. కౌలురైతు గుర్తింపు కార్డున్న వారికి అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల పెట్టుబడి సాయం వస్తుందని, లబ్ధిదార్ల పేర్లను రైతు సేవా కేంద్రాల వద్ద త్వరలోనే ప్రదర్శిస్తామని వ్యవసాయ శాఖ జెడి చెప్పారు. పంటలు నష్టపోయిన వారిలో కౌలురైతులుంటే నష్టం అంచనా జాబితాల్లో వారి పేర్లను నమోదు చేసి సచివాలయాల్లో ప్రకటించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రకటన ప్రకారం ఈనెల 8వ తేదీతో ఈ-క్రాప్ నమోదు పూర్తవుతుందని, అయితే రబీ సీజన్ ఇప్పుడిప్పుడే

2లో

ఒక్కో చేనేత కుటుంబానికి రూ.20 వేలు ఇవ్వాలి

మంత్రి సవితకు విన్నవించి సమస్యలు వివరించిన చేనేత కార్మిక సంఘాలు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

మొంథా తుపాను కారణంగా పనులు కోల్పోయిన చేనేత కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి చేనేత కుటుంబానికి రూ.20 వేలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు కుంచనపల్లిలోని కార్యాలయంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవితను సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. బాల్కృష్ణ మాట్లాడుతూ చేనేత కుటుంబాలకు ఇప్పటికే సరిగా పనుల్లేక ఇబ్బందులు పడుతుంటే, తుపాను వల్ల పూర్తిగా పనుల్లేకుండా పోయాయని అన్నారు. పడుగు, మగ్గం నష్టపోయిన

2లో



మంత్రికి సమస్యలు వివరిస్తున్న నాయకులు

నకిలీ బిల్లులతో ఇంటి పన్నులు వసూలు!

తాడికొండలో వెలుగులోకి...

- 2 లో

వైసిపి నేతలపై అక్రమ కేసులు : అంబటి

2లో

సమస్యలకు నిలయాలు.. సంక్షేమ హాస్టళ్లు





నియోజకవర్గంలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా మారాయి. కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు సతమతమవుతున్నారు. మరుగుదొడ్లు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి, హాస్టస్ల పైకప్పు శ్లాబ్ ఎప్పుడు ఊడి మీదపడుతుందోనని భయం భయంగా గడుపుతున్నారు. వర్షం వస్తే శ్లాబ్ నుంచి నీరు కారుతోంది.. చలికాలంలో అయితే పరిస్థతి మరీ దారుణంగా ఉంటోందని హాస్టళ్ల విద్యార్థులు వాపోతున్నారు. చలికాలంలో కనీ కప్పుకోవడానికి దుప్పట్లు కూడా లేని పరిస్థితి నెలకొంది చెబుతున్నారు. హాస్టళ్ల వార్డెన్లు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు స్పందిచి తమ సమస్యలు తీర్చాలని విద్యార్థులు వాపోతున్నారు.

- ప్రజాశక్తి, చిలకలూరిపేట

2 లో

- మరుగుదొడ్లు దోర్లు నిల్
- పెచ్చులూడిన గదుల శ్లాబ్
- చలికి వణుకుతున్న విద్యార్థులు
- పట్టీపట్టనట్లు ఉంటున్న వార్డెన్లు





పంటనష్టం అంచనాల్లో భారీగా కోత

(మొదటి పేజీ తరువాయి)

నమోదు కేవలం 10 శాతంకు పరిమితం అయింది. తొలుత 33 వేల ఎకరాల్లో వరిపంట మునిగినట్టు గుర్తించినా తుది అంచనాల్లో 2100 ఎకరాల్లోనే నష్టం జరిగిందని నిర్ధారించారు. 23 వేల ఎకరాల్లో పత్తికి నష్టం జరిగిందని తొలుత అంచనా వేయగా తుది అంచనాల్లో కేవలం కేవలం 80 ఎకరాల్లోనే నష్టాన్ని నిర్ధారించారు. 1100 ఎకరాల్లో మినుము పంట దెబ్బతిందని లెక్కగట్టారు. ఉద్యాన పంటలకు సంబంధించి మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల, తెనాలి, కొల్లిపర, తాడికొండ, పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని, ప్రత్తిపాడు, పెదనందిపాడు మండలాలకు చెందిన 2913 మంది రైతులకు చెందిన 3850 ఎకరాల్లోనే అరటి, పసుపు, కూరగాయలు, తమలపాకు, బొప్పాయి, మిర్చి పంటలకు నష్టం జరిగిందని అంచనాలు రూపొందించారు. పల్నాడు జిల్లాలో కూడా తొలుత 60 వేల ఎకరాల్లో పంటలు నష్టం జరిగిందని అంచనాలు రూపొందించగా తుది అంచనాల్లో కేవలం 6 వేల ఎకరాల్లోనే నష్టం జరిగినట్టు చూపారు. వరి, పత్తి, కంది, మిర్చికి అపార నష్టం జరిగింది. పిడుగురాళ్ల మండలంలో 15,952 ఎకరాలలో కంది పంట సాగు చేశారు. అయితే మండలంలో కంది పంట ఆలస్యంగా సాగు చేశారని ప్రస్తుతం ఎదుగుదల దశలో ఉన్నందున మొలకెత్తిన చిన్న మొక్కలు మాత్రమే అధిక వర్షాలకు కుళ్లిపోయాయని, అందువల్ల ఈ పంటకు నష్ట పరిహారం రాదని అధికారులు తేల్చారు. 10 నుంచి 30 రోజులు పెరుగుదల దశలో లేత పంట కావడం వల్ల ప్రభుత్వ నిబంధన ప్రకారం దానిని నష్టంగా పరిగణించలేమని వ్యవసాయ శాఖ అధికారులు ప్రకటించారు. పంట చేతికొచ్చే దశలో ఉండి 33 శాతానికి పైగా దెబ్బతింటేనే పరిహారం వస్తుందని అధికారు లు స్పష్టం చేస్తున్నారు.

నష్టం జాబితాలో కౌల్దార్ల పేర్లు రాయండి

(మొదటి పేజీ తరువాయి)

ఊపందుకుంటున్న దృష్ట్యా గడువును పెంచాలని కోరారు. మొంథా తుపాను నేపథ్యంలో దెబ్బతిన్న పంటల నష్టపరిహారం ఆహర పంటలైతే ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య పంటలైతే రూ.50 వేలు చొప్పున చెల్లించాలన్నారు. కౌలు రైతులకు ఉచిత పంటల బీమాను అమలు చేయాలని కోరారు. రైతుల వద్దున్న పత్తి పంటనంతటినీ సిసిఐ ద్వారా కొనుగోలు చేయాలని, కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. రబీ సీజన్లో కౌలు రైతులకు పంట రుణాలు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రూ.2 లక్షల వరకు ఇవ్వాలన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ రైతుల పంట రుణాలు మాఫీ చేయాలన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ పెంచి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ, నాయకులు టి.పెద్దిరాజు, వై.వెంకటేశ్వరరావు, టి.హనుమంతరావు, జి.పిచ్చారావు, అమరలింగేశ్వరరావు, ఎస్.లూథర్ పాల్గొన్నారు.

ఒక్కో చేనేత కుటుంబానికి రూ.20 వేలు ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి కుటుంబానికి నష్టం అంచనా వేసి పరిహారం అందించాలన్నారు. చేనేత సొసైటీలకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.203 కోట్ల బకాయిలను, థ్రిఫ్ట్ ఫండ్ వెంటనే చెల్లించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పి.నాగేశ్వరరావు, ఆర్.పూర్ణచంద్రరావు, కె.కోటీశ్వరుడు, జి.బాలాజీ, డి.రామారావు, జి.వెంకట కృష్ణారావు, కె.కుమారి, బి.గిరి, సిహెచ్.సీతారామాంజనేయులు, బి.బాలతీడేరూ, జి.పరమేశ్వరరావు ఉన్నారు.

వైసిపి నేతలపై అక్రమ కేసులు : అంబటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వైసిపి వారిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందని మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. వైసిపి సోషల్ మీడియా కార్యకర్త ప్రతాపరెడ్డిని సెప్టెంబరు 24న పోలీసులు అరెస్టు చేయగా జిల్లా జైలులో ఉన్న ఆయన్ను ములాఖత్‌లో భాగంగా అంబటి రాంబాబు, నూరిఫాతిమా సోమవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో రాంబాబు మాట్లాడుతూ చంద్రబాబు రైతులను బెదిరిస్తున్నారని సోషల్ మీడియాలో ఎవరో పోస్టు పెట్టగా ఆ వ్యక్తితో ప్రతాపరెడ్డికి సంబంధం ఉందంటూ అక్రమ కేసు పెట్టారన్నారు. సోషల్ మీడియాలో రాజకీయ విమర్శలు చేస్తే అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. ప్రతాపరెడ్డిని ఇప్పటికి రెండు సార్లు పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించారని, అమ్మాయిల నగ్న వీడియోలతో డబ్బులు సంపాదిస్తున్నట్లు, వైసిపి నుంచి డబ్బులు వస్తున్నాయంటూ ఒప్పుకోవాలని పోలీసులు వత్తిడి చేసినా విచారణ సమయంలో అడ్వకేట్ ఉండడం వల్ల అది సాధ్యపడలేదన్నారు. జోగి రమేష్‌ను కూడా ఇలాగే తప్పుడు స్టేట్మెంట్లు తీసుకుని అరెస్టు చేశారన్నారు. తుపాను వల్ల పంట దెబ్బతిందని చెబితే రైతులకు వివరాలు నమోదు చేయకుండా కుంటిసాకులు చెబుతున్నారని విమర్శించారు.

సమస్యలకు నిలయాలు సంక్షేమ హాస్టళ్లు

మరుగుదొడ్లకు డోర్లు లేవు.. - పెచ్చులూడి ఎక్కడ పడతాయోనని భయంతో పిల్లలు

అందుబాటులో ఉండని కొంతమంది వార్డెన్లు



ప్రజాశక్తి-చిలకలూరిపేట

పేదలకు మంచి విద్యనందించాలనే ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయాలు మారుతున్నాయి. హాస్టళ్లలోని విద్యార్థులు వానకు తడుస్తూ, చలికి వణుకుతూ ఎప్పుడు స్లాబ్ పెచ్చులూడి మీద పడతాయో భయం భయంగా జీవిస్తున్నారు. దీనికి తోడు చాలీచాలని గదులు... వర్షం వస్తే నీటితో నిండిపోతున్నాయి. అక్కడే వస్తువులు పెట్టుకోవటం, చదువు కోవటం, అక్కడే నిద్ర పోవటమే కాకుండ కనీస మౌలిక సదుపాయాలు లేక సతమత మౌతున్నామని వాపోతున్నారు.

దళిత, గిరిజన, వెనుక బడిన హాస్టళ్లలో విద్యార్థిని, విద్యార్థులు. పేద నిరుపేద కుటుంబాల పిల్ల లకు నాణ్యమైన విద్య ప్రస్తుతం అం దని ద్రాక్షగా మారింది. ఉదయం, సాయంత్రం ప్రయివేట్‌గా చదువులు చేప్పేవారు లేక ఎదో వానా కాలం చదు వులతో సరిపెట్టు కోవటంతో సరిపెట్టు కుంటున్నారు.కనీస మౌలికసదుపాయాలు లేక దు ర్భరమైన జీవితం గడుపు తున్నారు. దానికి తోడు ప ట్టణం లో ఉన్న హస్టల్స్ లో కాలం వె ళ్ళబుచేందుకి (టైం పాస్ కో సం) పని చేస్తున్నట్లు కొంత మంది వార్డెన్లు పని తీరు ఉం టే.. మరి కొంత మంది ఊరు ఒక చోట ఉద్యోగమొక చోట ల వార్డెన్ల పరిస్థితు లున్నాయి....నియోజక వర్గంలో ఇండ్లల్లో సరై న సౌకర్యాలు లేని పేద,నిరు పేదవారి పిల్ల లు 4,5 వేల మంది ఉన్నారు. వీరే కాక వలస కార్మికుల కుటుంబాలు నియోజక వర్గ స్థాయిలో షుమారుగా 30 వేలు గా వున్నా రు. వారిలో పిల్లలు వెయి నుంచి 1500 వందల వరకు వున్నా రు. అందులో అందరూ పేద వలస కార్మికులు. వీరిలో కొంత మంది దగ్గ రలోని ప్రయివేట్ స్కూల్స్ కి పంపు తున్నారు. మొత్తం 6500 వందల మందికి గాను మొత్తం అన్ని హాస్టళ్ల లో ఉంటున్న పిల్లలు నియోజకవర్గ మొత్తం 4,5 వందల మంది విద్యార్థు లు మాత్రమే ఉంటున్నారు.... పట్టణంలో బి.సి. ఎస్.సి. ఎస్టీ బాయిల్స్, గరల్స్ ల్స్ హాస్టళ్లు మొత్తం కలిపి 5 ఉన్నాయి. మండల స్థాయిలో మురికిపూడిలో ఎస్.సి హాస్ట ల్ ఉంది. నియోజకవర్గ పరిధిలో నాదెండ్లలో ఒక బి.సి, యడ్లపాడులో ఒక హాస్టల్ ఉన్నాయి..స్థానిక పట్టణంలో ఒక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం, ఒక బి.సి. బాలుర వసతి గృహం ఒకొక్కకటి బి.సి. కాలేజిబాయ్స్ గర్లల్స్ హాస్టల్ కలిపి మొత్తం 5 గా ఉన్నాయి. వాటిల్లో ముఖ్యంగా ఏ.పి గిరిజన సంక్షేమ గురుకుల (బాలురు) పాఠశాలలో ఒకప్పుడు 80/85 మందితో కలకళలాడిన సరైన వసతులు, చదువు లేక ప్రస్తు తం 40 మందిగా వున్నారు. విరికి కూడా స రైన వసతులు లేవు. 4 గదులే ఉన్నాయి. 4,5 గురు నిదురించాల్సిన గదుల్లో 10 మంది ఉండి ఉన్న చిన్న చిన్న గదుల్లో వారి వారి వస్తువులు పెట్టుకోవటం, అక్కడే చదువు కోవటం, అక్కడే నిదరించాల్సి వస్తుందంతన్నారు ముఖ్యంగా మౌలిక సదుపాయాలు లేవు. డోర్లు ఉండి వాటికి రేకులు లేని 4 లెట్రిన్స్, 4బాత్రూమ్స్ తో సతమతమౌతు మ రి దారుణంగా బహి రంగంగా సిమెంట్ రేకు లు అడ్డు పెట్టుకును 4,5 గురు వరస క్రమంలో అక్కడే కూర్చుని పంపు తిప్పి పిప్పిని బహి రంగంగా బయటకు పంపుతున్నారు. లెట్రిన్ షీట్లు పగుళ్ళ తో దుర్వాసన వస్తోం ది. దాదాపు అన్ని హాస్టల్లల్లో పిల్లలకు తగ్గ లెట్రిన్, బాత్రమ్స్ లేవు. కొన్ని హాస్టల్ లో అయితే మంచి నీటిలో సౌకర్యం లేక కొన్ని ఉ ప్పు త్రాగు తున్నారు. ఏ ఒక్క హాస్టళ్లలో మె డికల్ కు సంబంధించిన సరైన కనీస వసతు లు లేవు. వర్షా కాలంలో వచ్చే సీజనల్ రో గాలకు సిద్ధంగా మందులు లేవు. కనీసం మె డికల్ క్యాంపులు నిర్వహించిన దాఖ లాలు లేవు. బ్లీచింగ్,పాగింగ్ దరి దాపుల్లో కనిపిం చ టం లేదు.దీంతో తమ పిల్లల కష్టాలను చూసి కొంత మంది తల్లి దండ్రులు స్కూల్స్ కు పంపి హెూస్టలకు పంప కుండా ఇళ్ల వద్దనే ఉంచు కుంటున్నారు.... ఇప్ప టికైన ప్రభు త్వం స్పందించి సొంత హాస్టళ్లు నిర్మించాల ని,హాస్టల్ పిల్లలు పరా యి పిల్లల కాకుండా ఉదయం,సాయంత్రం చదివించటం, మంచి నీరు,ప్రభుత్వ మెను ప్రకారం భోజనం, కనీస మౌలిక సదుపాయా లైన మరుగుదొడ్లు, స్నానాల గదులు, దోమల నివారణ,నిద్ర పోవటానికి క నీస సౌకర్యం,మెడికల్ క్యాంప్లు, మధ్య మధ్యలో కళ్ళ,ఇతర శారీర రుగ్మతలకు సంబంధించి న పరీక్షలు,దోమల ని వా రణకు దోమల కడ్డీలు బ్లీచింగ్, ఫాగింగ్ లాంటివి వెంటనే ఏర్పటు చెయ్యాలని,మనోల్లా సానికి ఆట స్థలం లాంటివి కల్పించి మంచి విద్యార్థులుగా తీర్చి ది ద్దాలని కోరు కుంటున్నారు.

పిఎంఎవై గృహ నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రధాన మంత్రి ఆవాస యోజన (పి.యం.ఏ.వై) గృహ నిర్మాణ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలసి హౌసింగ్, గ్రామ, వార్డు సచివాలయం, ఉపాధి హామీ పథకం, రీ సర్వే , రెవెన్యూ అంశాలు , ఏపీ సీఆర్డీఏ అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండలస్థాయి అధికారులు , మండల స్థాయి ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తి అయిన ఇళ్ళలో లబ్ధిదారులు నివసించేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రధాన మంత్రి అవాస్ యోజన 2.0 పథకం ద్వారా ఇళ్ళు నిర్మించుకోవటానికి ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. గ్రామ / వార్డు సచివాలయాల ద్వారా తల్లికి వందనం, బయోమెట్రిక్ అప్డేషన్, చైల్డ్ ఆధార్, ఈకెవైసీ, కౌసలం సర్వేను పూర్తి చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, కార్యాలయం నుండి బయటకు వెళ్ళేటప్పుడు మూవ్‌మెంట్ రిజిస్టర్ లో తప్పక నమోదు చేయాలన్నారు. పిల్లలకు ఆధార్ నమోదు చేయాలని, అలాగే ఆధార్ అప్ డేట్ చేయాలన్నారు. వలస వెళ్ళిన, చనిపోయిన వారి ఆధార్ లను తొలగించాలన్నారు. స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీని పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటటం, అవెన్యూ ప్లాంటేషన్, ఫొడర్ ప్లాంటేషన్, పశువుల పాకలు నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. స్వామిత్వ ద్వారా గ్రామాల్లో జరుగుతున్న సర్వే పనులను వేగవంతం చేయాలన్నారు. యూరియా అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులపై మండల కమిటీలు దీనిపై విచారణ చేయాల న్నారు. ఇటీవల తుపానుకు దెబ్బతిన్న పంటల నష్ట వివరాలపై రైతులు ఏమైనా అభ్యంతరలు వ్యక్తం చేస్తే తెలియజేయాలని సూచించారు. మండలాలలో తహసీల్దార్లు, యంపిడిఓ లు అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని తెలిపారు. రీ సర్వే, సిఆర్‌డిఎ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించి అధికారులకు సూచనలు అందజేశారు. ధాన్యం, పత్తి సేకరణ ప్రక్రియలో క్రియా శీలకంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ ఎన్ ఎస్ కె ఖాజావలి , జెడ్ పి సిపిఒ జ్యోతిబసు, సీపీఓ శేషశ్రీ, డిపిఓ నాగసాయి కుమార్, హౌసింగ్ పీడీ ప్రసాదు, డ్వామా పీడీ శంకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నకిలీ బిల్లులతో ఇంటి పన్నులు వసూలు!

ప్రజాశక్తి - తాడికొండ

నకిలీ బిల్లులు ముద్రించి ఇంటి పన్నులు వసూలు చేసిన ఘటన తాడికొండ పంచాయతీలో సోమవారం వెలుగు చూసింది. గ్రామంలోని డోర్ నెం 17 /164 లో నివాసం ఉంటున్న ఆళ్ల సుమతి 2020లో రూ.7,278 ఇంటిపన్ను, 2021లో రూ.7,378 చొప్పున పన్నును పంచాయతీలో డైలీవేజ్ ప్రాతిపదికన పనిచేసే వ్యక్తికి చెల్లించారు. అయితే ఇటీవల పంచాయతీ అధికారులు 2020, 2021 సంబంధించి ఇంటి పన్నులు పెండింగ్ ఉన్నాయని, ఆ బకాయిలను చెల్లించాలని సుమతికి నోటీసులు పంపారు. నోటీస్ అందుకున్న సుమతి ఈ విషయాన్ని తన భర్త సీతారెడ్డికి చెప్పడంతో ఆయన సోమవారం పంచాయతీ కార్యదర్శి రమణయ్య వద్దకెళ్లి తాము గతంలో చెల్లించిన పన్నుల తాలూకు రసీదులు చూపించారు. దీంతో కార్యదర్శి గత రికార్డులను తనిఖీ చేయగా రసీదులు నకిలీవని తేలింది. దీనిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామంలో ఇదేవిధంగా పలువురు పన్నులు చెల్లించినట్లు తెలిసింది. ఆ సమయంలో ఇక్కడ కార్యదర్శిగా చేసిన వ్యక్తి సార్వత్రిక ఎన్నికల అనంతరం బదిలీ అయ్యారు.

ప్రతి గ్రామం స్వచ్ఛతకు నిలయం కావాలి

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రతి గ్రామం స్వచ్ఛతకు నిలయం కావాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. జిల్లా నీరు, పారిశుధ్య కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణకు పెద్దపీట వేయాలని, ఎక్కడా బహిరంగ మలవిసర్జన లేకుండా చూడాలని అన్నారు. బహిరంగ మలవిసర్జన రహిత (ఓ.డి.ఎఫ్) గ్రామాలుగా గతంలో ప్రకటించిన గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి పరిస్థితులను గమనించాలన్నారు. ఎక్కడైనా వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లు అవసరం అనుకుంటే మంజూరుకు ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. తాగునీరు సరఫరాలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రామీణ నీటిసరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీర్ కె.కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ కొత్తగా వ్యక్తిగత మరుగుదొడ్ల మంజూరుకు ప్రతిపాదనలు రావాల్సి ఉందని, ఇప్పటి వరకు 115 అందాయని కలెక్టర్‌కు తెలిపారు.గ్రామ సచివాలయాల పరిధిలో 109 సామూహిక మరుగుదొడ్లు మంజూరు చేయగా 101 పూర్తి చేయడం జరిగిందన్నారు. అంగన్వాడీల వద్ద 22 మంజూరు చేయడం జరిగిందని, వసతి గహాలు తదితర ఇతర ప్రదేశాల్లో 17 మంజూరు చేశామన్నారు. గ్రామస్థాయిలో 171 నీరు, పారిశుధ్య కమిటీలు ఏర్పాటు చేశామన్నారు 171 గ్రామాలను ఓ.డి.ఎఫ్ గ్రామాలుగా గతంలో ప్రకటించడం జరిగిందన్నారు. జిల్లాలో 121 ఆవాసాల్లో 251 స్లో సాండ్ ఫిల్టర్లు ఉన్నాయని, అందులో 38 అవాసాల్లో గల 78 ఫిల్టర్లు పనిచేస్తున్నాయని, వాటి మరమ్మతులకు రూ.2.32 కోట్లు అవసరమని అంచనా వేశామన్నారు. 23 ఆవాసాల్లో 48 పాక్షిక ఫిల్టర్లలో 24 పనిచేయట్లేదని వాటి మరమ్మతులకు రూ.1.59 కోట్లు అవసరమని, 60 అవాసాల్లో 125 ఫిల్టర్లు ఉన్నాయని, అవి పనిచేయట్లేదని, అందుకు రూ.8.85 కోట్లు అవసరమని అంచనా వేశామన్నారు. ప్రాధాన్యత ప్రాతిపదికన 49 చోట్ల అవసరమని గుర్తించామని అందుకు రూ.6.32 కోట్లు అవసరమని, జిల్లా పరిషత్‌కు ప్రతిపాదించామని వివరించారు. 44 గ్రామాల్లో 66 లీకేజీలను గుర్తించి అరికట్టడం జరిగిందని చెప్పారు. జల జీవన్ మిషన్ కింద 313 పనులు రూ.94.97 కోట్లతో చేపడుతున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లాకు, బాపట్ల జిల్లాలో కొంత భాగానికి ప్రకాశం బ్యారేజ్, నాగార్జున సాగర్ డామ్ నుండి ఉపరితల నీటి సరఫరాతో తాగు నీటిని కల్పించుటకు వాటర్ గ్రిడ్ ప్రతిపాదనలను రూ.7496 కోట్లతో తయారు చేసి సమర్పించాలని వివరించారు. సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయికుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ర్యాలీలో విద్యార్థులు, అధ్యాపకులు

వ్యసన రహిత సమాజమే ఆరోగ్యకరం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

నిర్మల ఫార్మసీ కళాశాల, మంగళగిరి జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక శిబిరం మూడవ రోజు సోమవారం 'వ్యసన రహిత సమాజం - ఆరోగ్య భారతం' అనే ప్రధాన అంశంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు ఈగిల్ సెల్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం.సునీల్‌బాబు హాజరై విద్యార్థులకు వ్యసనాల దుష్ప్రభావాలను వివరించారు. డ్రగ్స్ మద్యం తాత్కాలిక ఆనందంలాగానే కనిపించినా, జీవితాన్నే నాశనం చేసే శక్తి వాటిలో దాగి ఉందన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి. నిర్మలజ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. పాములరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక బాధ్యతా భావాన్ని పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ పాత్ర ప్రశంసనీయమని అన్నారు. కార్యక్రమంలో అతిథులుగా విజయవాడ నవజీవన బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ జి.శేఖర్‌బాబు, మహిళా పోలీస్ ఎం.సుమతి, సిహెచ్ సాయిబాబు, బి.సురేష్ జోనల్ కోఆర్డినేటర్ నవజీవన బాల భవన్ పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కళాశాల మైదానం జలమయం

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తరచూ చిన్నపాటి వర్షానికే కళాశాల క్రీడా మైదానంలో నీరు నిలుస్తూ ఉండటంతో కళాశాల విద్యార్థులకు అధ్యాపకులకు ఇబ్బందికరంగా మారింది. క్రీడా మైదానంలో మోకాలు పైగా నీళ్ల నిలిచి ఉంటున్నాయి. కళాశాల ప్రాంగణం నుంచి గుంటూరు ఆర్అండ్‌బి రోడ్డు వరకు కాలువ పూడికలు తీయించి ఇబ్బందులు తొలిగించాలని సోమ వారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వీరరాఘవయ్య, ఫిజికల్ డైరెక్టర్ పాతూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు, కళాశాల సిబ్బంది పెదనందిపాడు తహాశీల్దార్ హేనాప్రియకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహాశీల్దార్ వెంటనే ఎంపీడీవో స్వామి రెడ్డిని పిలిపించి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

రోడ్డును విస్తరిస్తే కారుణ్య మరణమే

ప్రజాశక్తి - మంగళగిరి

తెనాలి రోడ్డు విస్తరణ బాధితులు జిల్లా జాయింట్ కలెక్టర్‌ని, మంగళగిరి కార్పొరేషన్ ఎడిషనల్ కమిషనర్ కే. శకుంతలని సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో కలిసి వినతి పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా తెనాలిరోడ్డు చేనేత పరిరక్షణ, విస్తరణ బాధితుల సంఘం కన్వీనర్ జొన్నాదుల గురుమోహనరావు మాట్లాడుతూ ఎంటిఎంసి నగరపాలక సంస్థ పరిధి మంగళగిరిలోని తెనాలి రోడ్డును 60 అడుగుల రోడ్డుగా విస్తరణ చేయడం వల్ల నివాసితులకు, రోడ్డు వెంబడి ఉన్న చిరువ్యాపారులు, చేనేత వ్యాపారుల ఇండ్లు, దుకా ణాలు పూర్తిగా పోతాయని అన్నారు. దీనితో జీవనాధారం, నివాస గృహాలతోపాటు సర్వం కోల్పోయి నిరాశ్రయులై రోడ్డు న పడాల్సి వస్తుందని తెలిపారు. మరో బాధితురాలు గోలి సుధ మాట్లాడుతూ మేము అభివృద్ధికి వ్యతిరేకం కాదనీ, ఇళ్ళు, దుకాణాలు కోల్పోయి నిరాశ్రయులను చేసే అభివృద్ధి ఆమోదయోగ్యం కాదని అన్నారు. కాదు, కూడదంటే మాలో చాలా మందికి కారుణ్య మరణం తప్ప వేరే మార్గం లేదని అన్నారు. కాబట్టి అనేక మలుపులు ఉన్న తెనాలి రోడ్డును 60 అడుగులకు విస్తరించే నిర్ణయాన్ని వెనక్కు తీసుకుని, జాతీయ రహదారిని నేరుగా అనుసంధానం చేసే ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించి అభివృద్ధి చేపట్టాలని కోరారు.



జాయింట్ కలెక్టర్‌కి సమస్య వివరిస్తున్న బాధితులు



వినతి పత్రం సమర్పిస్తున్న ఉద్యోగులు

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఎన్నిక పారదర్శకంగా నిర్వహించండి

ప్రజాశక్తి - తెనాలి

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ తెనాలి యూనిట్ కార్యవర్గ ఎన్నిక పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసు కోవాలని కోరుతూ పలువురు ఉద్యోగులు సోమవారం సబ్‌కలెక్టర్ సంజన సింహకు వినతి పత్రం సమర్పించారు. ఎన్జీవో అసోసియేషన్ ఎన్నిక జరిగిన తీరు, గతంలో పలు పరిణామాలను ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ప్రస్తుత పాలకవర్గ కాలపరిమితి సెప్టెంబర్ 2025తో ముగిసిందని, నూతన కార్యవర్గ ఎన్నికకు నిబంధనలకు విరుద్ధంగా, ఉద్యోగుల సమిష్టి ఆమోదం లేకుండా, రాజకీయ పార్టీలకు అనుకూలంగా నూతన కార్యవర్గాన్ని ప్రకటించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు ఆరోపించారు. అనుకూలమైన ఉద్యోగులకు మాత్రమే సభ్యత్వం కల్పించి, కార్య వర్గాన్ని కూడా ఏకపక్షంగా ప్రకటించే కుట్ర జరుగుతుందని చెప్పారు. ఎన్నిక పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులు కోరినట్లు వారు వెల్లడించారు. వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

కళ్ళం అశోక్‌రెడ్డి, తండ్రి : సాంబిరెడ్డి, నూతక్కి గ్రామం, మంగళగిరి మండలం. నాకు సంబంధించిన పెదకాకాని గ్రామంలో, సర్వే నెం.13/సి లోని 250 చదరపు గజాల భూమి, ది.22-12-1987న రిజిస్ట్రేషన్ జరిగినది. డాక్యుమెంట్ నెం. 10473/1987. ఈ డాక్యుమెంట్‌ను తీసుకొని అమరావతి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసుకు వస్తుండగా దారిలో ఎక్కడో జారి పోయినది. ఎవరికైనా దొరికిన యెడల క్రింది ఫోన్ నెంబర్లకు తెలుపగలరు.

ఇట్లు
కళ్ళం అశోక్‌రెడ్డి.
సెల్ నెం. 9381548394
8977795302

నోటీసు

మహారాజశ్రీ గుంటూరు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం.1619/2025 ,ఐ.ఎ.నెం.1621/2025 & ఐ.ఎ.నెం.1622/ 2025 ఇన్ ఐ.ఎ.నెం.1427/2019 ఇన్ సి.యం.ఎ.నెం. /2019

బిట్వీన్:
షేక్ చిన ఖాశీం వగైరాలు ....పిటీషనర్లు/ అప్పీలెంట్స్
మరియు
కట్టమూరి పార్వతి వగైరాలు ....రెస్పాండెంట్లు

టు,
ఆర్-6 : చలువాది కృష్ణమూర్తి, తండ్రి.సుబ్బారావు
ఆర్-7 : చలువాది యుగంధర్, తండ్రి.కృష్ణమూర్తి.
ఆర్-8: చలువాది మల్లికార్జునరావు, తండ్రి కృష్ణమూర్తి.
ఆర్-9 : చలువాది తులసీ రత్నకుమారి, తండ్రి.కృష్ణమూర్తి.
అందరి నివాసం.డోర్ నెం.8-11-100, 7/7, పుహా రోడ్డు, శ్రీ నగర్, గుంటూరు.

పై నెంబరు ఐ.ఎ.నెం.1619/2025, ఐ.ఎ.నెం. 1621/2025 & ఐ.ఎ.నెం.1622/2025 ఇన్ ఐ.ఎ. నెం. 1427/2019 ఇన్ సి.యం.ఎ.నెం. /2019లో 6 నుండి 9 రెస్పాండెంట్లు అయిన మీకు పై కోర్టు నుండి నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది:12-11-2025 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం మీ పరోక్షంగా విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:12-11-2025

నాయుడు విజయ భాస్కర్,
పిటీషనర్లు /అప్పీలెంట్లు తరపు అడ్వకేట్,
నాయుడు పేట , గుంటూరు.

పబ్లికేషన్

మహారాజశ్రీ గుంటూరు 2వ అదనపు జిల్లాజడ్జి గారి కోర్టులో
E.A. 348/23 E.P. 1684/18 O.S. 121/09
బి. ప్రభాకరరావు (డైడ్) వగైరాలు ... DHR's
Vs
పి.కృపాసాగర్, వగైరాలు ... JDR's

To,
R3 : మర్రి వెంకటరామిరెడ్డి, తండ్రి : వెంకట సుబ్బారెడ్డి, సా॥ డోర్ నెం. 4-60, గణపవరం గ్రామం, రాజుపాలెం మండలం, సత్తెనపల్లి JCJC
R4 : గంజికుంట సాంబశివరావు, తండ్రి : చెంచయ్య, సా॥ శ్రీనివాస కాలనీ, గుంటూరు సిటీ & JCJC

ఈ నెంబరు ఇ.పి.లో DHR లు షెడ్యూలు దాఖలా ఆస్తిపై మీ వగైరాలపై పోలీసు Aid ఇప్పించమని కోరుతూ ఈ పిటీషన్ దాఖలు చేయగా సదరు పిటీషన్‌లో మీకు నోటీసు నిమిత్తం ది. 13-11-2025వ తేదీకి వాయిదా వేసినారు. గాన మీరు పై తెలిపిన తేదీ ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలెను.ల లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 13-11-2025

ఇట్లు
పడాల విజయకిరణ్,
వంగా శ్రీనివాసరెడ్డి,
DHR's తరఫు న్యాయవాదులు,
6/12 బ్రాడీపేట, గుంటూరు.

ప్రకటన

నా క్లయింట్ అయినటువంటి కంచర్ల కోటేశ్వరమ్మ W/o. జయరావ్ R/o. పెదకూరపాడు ఇచ్చిన్న సమాచారం మేరకు తేలుపునది.

నా క్లయింట్ కు సంబంధించినటు వంటి ఒరిజినల్ విక్రయ దస్తావేజు నెం. 2161/1984 dated. 28-07-1984, ఈ రోజుకు సుమారుగా నాలుగు రోజుల క్రితం కచేరి సెంటర్ లగడపాడు రోడ్డు పెదకూరపాడు సెంటర్ కు జిరాక్స్ కోసం తీసుకొని వెళ్ళగా దారిలో పోయినది. ఎంత ప్రయత్నించిన దొరక లేదు కావున, ఎవరికయినా సదరు దస్తావేజు దొరికిన యెడల ఈ క్రింద ఉదహహరించిన ఫోన్‌నెంబర్ కు తెలియజేయగలరు.

ఇట్లు
కె. సునీల్ సింగ్, నాయ్యవాది
సెల్ నెం. 9494017191

బహిరంగ ప్రకటన

నా క్లయింటు సత్తెనపల్లి మండలం, చినమక్కెన గ్రామ కాపురస్తుడు చెరుకూరి వెంకటేశ్వర్లు గారి కుమారుడు ఏడుకొండలు గారి నుండి సమాచారం పొంది యావన్మంది ప్రజానీకానికి తెలియజేయనది ఏమనగా..

నా క్లయింటు చెరుకూరి ఏడుకొండలు గారు అతని తల్లి చెరుకూరి ఆదెమ్మ గారి వద్ద దిగువ తెలిపిన షెడ్యూలు ఆస్తిని ది.17-4-1993న దఖలు దస్తావేజు సత్తెనపల్లి సబ్-రిజిస్ట్రార్ ఆఫీసులో 1744/1993గా పొందివున్నాడు. సదరు దఖలు దస్తావేజు నా క్లయింటు వద్ద పోయినది.

షెడ్యూలు : పెదమక్కెన సర్వే నెంబర్ 222-1ఎలో 0.86 1/2 సెంట్లు భూమి పైదస్తావేజు (నెంబర్ 1744/1993) దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌లో ఇవ్వగలరు.

సత్తెనపల్లి.
ది.03-11-2025

ఇట్లు
బగ్గి నరసింహారావు,
అడ్వకేట్, సత్తెనపల్లి.
ఫోన్ : 98493 66715.

పేరుమార్పు ప్రకటన

గుంటూరుజిల్లా, మేడికొండూరు మండలం, పేరేచర్ల గ్రామానికి చెందిన పొత్తూరు షేక్ ఆదంబి భర్త : మస్తాన్‌వలి అను నా పేరు తప్పుగా పెళ్ళికి ముందు పేరు నమోదయింది. ప్రస్తుతం పెళ్ళి అయిన తర్వాత నా పేరు షేక్ పొత్తూరి హసీనాగా ఆధార్ కార్డులో మార్పు చేసుకోవటం జరిగింది. యావన్మంది ప్రజలు గమనించగలరు.

ఇట్లు
షేక్ పొత్తూరి హసీనా
పేరేచర్ల గ్రామము.

దావా నోటీసు

మహారాజశ్రీ పొన్నూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.యస్.నెం.57/2024 మరియు ఐ.ఎ.నెం.68/2024

బిట్వీన్:
కంటా అనూష @ తోటకూర అనూష
... వాది (పిటీషనరు)
మరియు
తోటకూర శంభులింగం వగైరా ....
ప్రతివాది (రెస్పాండెంటు)

టు,
D-2 (R-2) : తోటకూర బాలచంద్ర, తండ్రి. శంభులింగం, తరపున తండ్రి మరియు జి.పి.ఎ. హోల్డరు తోటకూర శంభులింగం, తండ్రి. లేటు తిరుపతయ్య, నివాసం డోర్ నెం.3-14/ఎ, కారంపూడిపాడు గ్రామం, ముట్లూరు పోస్టు, వట్టిచెరుకూరు మండలం గుంటూరు జిల్లా-522212

పై నెంబరు దావాలో2వ ప్రతివాది మరియు ఐ.ఎ.నెం.68/2024 ఇన్ ఓ.యస్.నెం.57/2024 పిటీషనులో 2వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు/ నోటీసులు ఎన్ని సార్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు /నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది:18-11-2025నకు వాయిదా వేసినారు.కావున వాయిదా రోజు ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను.లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును . లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
వాయిదా తేది:18-11-2025

చాగంటి నరసింహా రెడ్డి,
పసుపులేటి శ్రీనివాస రావు,
వాది(పిటీషనరు) తరపు అడ్వకేట్స్,
5వలైను కన్నావారితోట, గుంటూరు.

దావా నోటీసు

మహారాజశ్రీ పొన్నూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.యస్.నెం.88/2024 మరియు ఐ.ఎ.నెం.128/2024

బిట్వీన్:
కంటా అనూష @ తోటకూర అనూష
... వాది (పిటీషనరు)
మరియు
తోటకూర శంభులింగం వగైరా
.... ప్రతివాది (రెస్పాండెంటు)

టు,
D-2 (R-2) : తోటకూర బాలచంద్ర, తండ్రి. శంభులింగం, తరపున తండ్రి మరియు జి.పి.ఎ. హోల్డరు తోటకూర శంభులింగం, తండ్రి.లేటు తిరుపతయ్య, నివాసం డోర్ నెం.3-14/ఎ, కారంపూడిపాడు గ్రామం,ముట్లూరు పోస్టు, వట్టిచెరుకూరు మండలం గుంటూరు జిల్లా-522212

పై నెంబరు దావాలో2వ ప్రతివాది మరియు ఐ.ఎ.నెం.128/2024 ఇన్ ఓ.యస్.నెం.88/2024 పిటీషనులో 2వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు/ నోటీసులు ఎన్ని సార్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు /నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది:18-11-2025నకు వాయిదా వేసినారు.కావున వాయిదా రోజు ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను.లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును . లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
వాయిదా తేది:18-11-2025

చాగంటి నరసింహా రెడ్డి,
పసుపులేటి శ్రీనివాస రావు,
వాది(పిటీషనరు) తరపు అడ్వకేట్స్,
5వలైను కన్నావారితోట, గుంటూరు.

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), నర్సీపట్నం వారి కోర్టులో
O.S. No. 07 / 2023

Between:
Peketi Rajeswari ...వాది
and
1) **Billakurthi Malleswari**, W/o. Lakshmi Narayana, age 45 years, Housewife, near Mosque, Mian Road, Narasaraopet, Guntur District (10వ ప్రతివాది).
2) **Billakurthi Prasanna**, D/o. Lakshmi Narayana, Housewife, near Mosque, Mian Road, Narasaraopet, Guntur District (11వ ప్రతివాది).
3) **Billakurthi Krishnaveni**, D/o. Lakshmi Narayana, age 22 years, near Mosque, Mian Road, Narasaraopet, Guntur District (12వ ప్రతివాది).

పై నెంబరు దావాను శ్రీమతి పేకేటి రాజేశ్వరి గారు 23 మంది ప్రతివాదులపై దాఖలుచేసి వాటాల పంపకం నిమిత్తం వాది శ్రీ కోర్టువారిని పరిహారం కోరియున్నారు. పై దావాలో మీరు ముగ్గురు 10 నుండి 12 ప్రతివాదులు అయి వున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టువారు ఎన్ని పర్యాయములు కోర్టు నుండి నోటీసులు పంపించినను, మీపై అమలుకాని కారణంగా కోర్టువారి అనుమతితో ప్రత్యామ్నాయ పద్ధతి అయిన పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు అమలు చేయుటకు కోర్టువారు అనుమతి ఇచ్చియున్నారు. కావున ఇందుమూలంగా ప్రతివాదులైన మీ ముగ్గురుకి తెలియజేయునది ఏమనగా, సదరు వాజ్యము మీ హాజరు నిమిత్తం ది.**12-11-2025**నకు వాయిదా అయి ఉన్నది. కావున మీ ముగ్గురు ఆరోజున ఉదయం **10.30** గంటలకు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, నర్సీపట్నం వారి కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి తగు ఆక్షేపణలు ఏమైన ఉంటే తెలియపరచుకొనవలెను. అట్లుకాని యెడల పైన ఉదహరించిన ఈ దావా మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి అనుమతితో)
పడాల రవి, అడ్వకేటు
పిఠాపురం, సెల్: 9848011614
నర్సీపట్నం
ది.04-11-2025
S.V.V.ప్రసాద్, అడ్వకేటు
నర్సీపట్నం

పబ్లికేషన్

మహారాజశ్రీ గుంటూరు 2వ అదనపు జిల్లాజడ్జి గారి కోర్టులో
E.A. 349/23 E.P. 1684/18 O.S. 121/09
బి. ప్రభాకరరావు (డైడ్) వగైరాలు ... DHR's
Vs
పి.కృపాసాగర్, వగైరాలు ... JDR's

To,
R3 : మర్రి వెంకటరామిరెడ్డి, తండ్రి : వెంకట సుబ్బారెడ్డి, సా॥ డోర్ నెం. 4-60, గణపవరం గ్రామం, రాజుపాలెం మండలం, సత్తెనపల్లి JCJC
R4 : గంజికుంట సాంబశివరావు, తండ్రి : చెంచయ్య, సా॥ శ్రీనివాస కాలనీ, గుంటూరు సిటీ & JCJC

ఈ నెంబరు ఇ.పి.లో DHR లు షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఫ్రెష్ డెలివరీ వారెంటు ఇప్పించమని కోరుతూ ఈ పిటీషన్ దాఖలు చేయగా సదరు పిటీషన్‌లో మీకు నోటీసు నిమిత్తం ది. 13-11-2025వ తేదీకి వాయిదా వేసినారు. గాన మీరు పై తెలిపిన తేదీ ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలెను.ల లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 13-11-2025

ఇట్లు
పడాల విజయకిరణ్,
వంగా శ్రీనివాసరెడ్డి,
DHR's తరఫు న్యాయవాదులు,
6/12 బ్రాడీపేట, గుంటూరు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు : సత్తెనపల్లి

O.S. 47/2021

Between :
Makkena Atchaiah .... వాది
And
Gujjarlapudi Vijaya kumar ... ప్రతివాది
to,
Gujjarlapudi Vijayakumar, S/o Late Babu Rao, R/o Ambedkar Street, Wared No.1, Sattenapalli Town, Palnadu District.

పై నెంబరు దావాలో సదరు వాది మీపై దావా ఆస్తిని తన పేరిటకి రిజిష్టర్ చేయమని దాఖలు చేసివున్నారు. సదరు దావాలో వాది మీకు ఎన్నిసార్లు కోర్టుద్వారా, ఆర్.పి. ద్వారా సమన్లు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. దరిమిలా విచారించగా మీరు అదే అడ్రసులో వుండునట్లుగా తెలిసినది. కావున సదరు వాయిదా మీకు నోటీసు నిమిత్తంగా ది. 20-11-2025వ తేదీకి వాయిదా వున్నది. కావున మీరు ఆ రోజున అనగా ది. 20-11-2025వ తేదీన మీరు స్వయంగా గానీ, అడ్వకేటు ద్వారా గానీ పై కోర్టులో హాజరయి మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలసినది. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదా తేది:20-11-2025

యడ్లపల్లి ప్రసాద్, బి.కాం., బి.ఎల్.
సత్తెనపల్లి. **వాది తరపు న్యాయవాది.**

వీరపనేని నగర్‌లో విద్యుత్ స్తంభాలు వేయాలి

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని విఠంరాజు పల్లి గ్రామం వీరపనేని నగర్లో విద్యుత్ స్తంభాలు వేయాలని సిపిఎం నాయకులు కె.హనుమంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వినుకొండ సబ్‌స్టేషన్‌లో ఎఇ శ్రీనివాసరావుకు వీరపనేని నగర్ వాసులతో కలిసి సోమవారం వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లారు. అయితే ఆయన లేకపోవడంతో వినతిపత్రాన్ని గోడకు అంటించారు. ఈ సందర్భంగా హనుమత్‌రెడ్డి మాట్లాడుతూ వీరపనేని నగర్‌లో ఎనిమిది లైన్లు ఉండగా 40 విద్యుత్ స్తంభాలు అవసరమని, ప్రస్తుతం 22 మాత్రమే ఉన్నాయని తెలిపారు. స్థానికుల ఇబ్బందులను గమనించి సత్వరం స్తంభాలు వేయాలని, విద్యుత్ ట్రాన్స్‌ఫారం కూడా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వర్లు, కె.సునీత, నాగేశ్వరమ్మ, భాగ్యమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.



కార్యాలయం గోడకు వినతిపత్రాన్ని అంటిస్తున్నా వీరపనేనినగర్ వాసులు



ఎస్ఎఫ్ఐ దాచేపల్లి కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-దాచేపల్లి : భారత విద్యార్థి ఫెడరేషన్ పట్టణ కమిటీ సమావేశం స్థానిక రసూల్ భవన్‌లో విక్రం అధ్యక్షతన సోమవారం జరిగింది. స్థానికంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా 20 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా అన్వర్, అధ్యక్షునిగా వెంకటేశ్, సహాయ కార్యదర్శులుగా రసూల్, ఆసిఫ్, ఉపాధ్యక్షులుగా సమీర్, నాగేంద్రబాబు ఎన్నియ్యారు. జిల్లా కమిటీ సభ్యులు నరేంద్ర, రామ సైదులు పాల్గొన్నారు.





ఉత్తమ సేవలు అందించిన వారికి పురస్కారాలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట, సత్తెనపల్లి రూరల్ : మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అత్యుత్తమ సేవలందించిన చిలకలూరిపేట తహశీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్, సత్తెనపల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.బోస్‌బాబుకు ఉత్తమ సేవా పురస్కారాలను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల అందించారు. విపత్తు సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడంలో ప్రభుత్వ సిబ్బంది చూపిన చురుకుదనం ప్రశంసనీయమన్నారు. ఈ మేరకు నరసరావుపేటలో జరిగిన అభినందన సభలో సత్కరించారు.

ఇసుక లారీలను మళ్లించండి

ఎమ్మెల్యేకు ఆన్‌లైన్ ద్వారా సిపిఎం వినతిపత్రం

ప్రజాశక్తి - అమరావతి : భారీ ఇసుక వాహనాలు అమరావతి - విజయవాడ రోడ్డు నుండి గ్రామంలో గుండా రాకుండా ఊరు వెలుపల నుండి రింగ్ రోడ్డు ద్వారా మరలించాలనే సిపిఎం కోరింది. ఈ మేరకు వినతిపత్రాన్ని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు వాట్సప్ ద్వారా పంపించినట్లు సిపిఎం రూరల్ కార్యదర్శి బి.సూరిబాబు, పట్టణ కార్యదర్శి మొదీన్‌వలి తెలిపారు. ఈ అంశంపై గతనెల 22న అమరావతి పోలీసులకు ఫిర్యాదు చేసినా పరిష్కరించలేదని పేర్కొన్నారు. కార్తీక మాసం నేపథ్యంలో వేలాది మంది అమరావతికి తెల్లవారుజామున, రాత్రిళ్లలోనూ సందర్శనకు వస్తుంటారని, ప్రమాదాలు వాటిల్లకుండా ఇసుక లారీలను మళ్లీంచాలని కోరారు.

ప్రతి ఊళ్లో 100 ఇళ్లకు సోలార్ పెట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ప్రతి గ్రామంలో వంద గృహాలకు తక్కువ కాకుండా పిఎం సూర్యఘర్ పథకం ద్వారా సౌర విద్యుత్ అందించాలని విద్యుత్ శాఖ అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల ఆదేశించారు. ఈ అంశంపై నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో సోమవారం సమీక్షించారు. నియోజకవర్గానికి 10 వేల సౌర విద్యుత్ కనెక్షన్లు లక్ష్యం సాధించేందుకు అనేక పరిపాలనా వెసులుబాట్లు కల్పించామన్నారు. బ్యాంకుల ద్వారా 10 రోజుల్లో రుణాల మంజూరు, సులభతరంగా విద్యుత్ కనెక్షన్ యజమాని పేరు మార్పులకు అవకాశం ఇచ్చామన్నారు. వెండర్లతో సమన్వయం చేసుకుని ఎక్కువ విద్యుత్ బిల్లు చెల్లిస్తున్న వినియోగదారులకు సౌర విద్యుత్ లాభాలను వివరిస్తూ ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని చెప్పారు. ఈఈ, డీఈ, ఏఈ స్థాయిల్లో నెలవారీ లక్ష్యాలు నిర్దేశించి సౌర గహాల సంఖ్యను పెంచాలన్నారు. నూతన సబ్ స్టేషన్లకు భూములను వెంటనే అప్పగిస్తామన్నారు. విద్యుత్ సరఫరా సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత చొరవ చూపాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరె, సీఆర్‌డీఏ ఎస్ఈ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఎస్ఇఈ విజయ్ కుమార్, సోలార్ ప్యానెల్ వెండార్లు పాల్గొన్నారు.

తుపాను సమయంలో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు సత్కారం

మొంతా తుపానును సమయంలో సమర్థవంతమైన సేవలందించిన పలువురు అధికారులను కలెక్టర్‌తోపాటు ఎస్పీ బి.కృష్ణారావు, జెసి సూరజ్ ధనుంజయ్ గనోరే సత్కరించి జ్ఞాపికలు అందించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంగా వ్యవహరించారని, పెద్ద ఎత్తున జరగాల్సిన తుపాను బీభత్సాన్ని పూర్తిగా నియంత్రించామని అన్నారు. ఈ క్రమంలో సిబ్బంది, ఉద్యోగులు ఎంతో నిబద్ధతతో పని చేశారని అభినందించారు. రానున్న కాలంలో ఎలాంటి విపత్తు వచ్చినా కలిసికట్టుగా ఎదుర్కోవాలన్నారు.

పల్నాడు కలెక్టర్ గ్రీవెన్స్‌కు 154 అర్జీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) వేదికలో అందిన అర్జీలను సత్వర పరిష్కరించాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ప్రజల నుండి 154 అర్జీలను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ సూరజ్, జిల్లా రెవెన్యూ అధికారి మురళి తదితరులు అర్జీలను స్వీకరించారు. అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దని, అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా పరిష్కారం ఉండాలని అధికారులతో కలెక్టర్ స్పష్టం చేశారు.

పల్నాటి ఉత్సవాలపై నేడు సమావేశం

ప్రజాశక్తి - కారంపూడి

పల్నాటి వీరారాధన ఉత్సవాలు ఈ నెల 19వ తేదీ నుండి 23వ తేదీ వరకు కారంపూడిలోని వీర్లగుడి ప్రాంగణంలో నిర్వహించనున్న దృష్ట్యా ఏర్పాట్లపై మంగళవారం సమావేశం ఉంటుందని తహశీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురజాల ఆర్‌డిఒ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరవుతారని, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొనాలని కోరారు.

రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో ఐడిపిఎస్ విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని ఎస్.ఎస్.ఎన్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఈ నెల 1, 2 తేదీలలో జరిగిన 19 వ రాష్ట్ర స్థాయి ఫ్లోర్ బాల్ అండర్-12, 17 బాల బాలికల పోటీల్లో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (ఐడీపీఎస్) విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చారని చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్ రావు, డైరెక్టర్ సబిత, ప్రిన్సిపల్ రేఖ పులేకర్ అభినందించారు. అండర్-12లో మొదటి స్థానం, అండర్-17 విభాగంలో రెండవ స్థానం సాధించారని చెప్పారు. అండర్-12 విభాగంలో షేక్. రిహాన్, బి.లోకనంద సాయి, టి.ఎన్.నంద సాయి, జి.జై సాయిచరణ్, డి.జై దేవ్, జి. భిరామ్‌రెడ్డి, ఎన్.వెంకట సాయి అఖిలేష్, జి.సాత్విక్ చైతన్య, జె. హర్షిత్ నాథ్ రెడ్డి, కె.అక్షయ నంద, ఐ.సాయి నిఖిలేష్, టి.జగదీశ్వర్‌రెడ్డి, అండర్-17 విభాగంలో కె.హర్షిత్, బి.చేతన్, ఆర్.జ్ఞానేశ్వర్, వీ.టి. మణికంఠ, బి.తులసి మణిదీప్, టి.జగదీష్, ఎన్.నిఖిల్, జి.లతికేష్, జి.కార్తికేయ, జె.జగన్, సి.హెచ్. తరుణ్ కోటిరెడ్డి, వై.కౌశిక్, యు.హేమచంద్ర, జె.జిష్ణు ఉన్నారన్నారు. వీరిని పాఠశాల ఫ్లోర్ బాల్ కోచ్ పి.సురేంద్ర, పిఇటి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు..

నరసరావుపేట పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఈ నెల 1న నిర్వహించిన 10వ, 11వ సబ్ జూనియర్, జూనియర్ వింటర్ ఇంటర్ డిస్ట్రిక్ బాలబాలికల స్విమ్మింగ్ పోటీల్లో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (ఐడిపిఎస్) విద్యార్థులు ప్రతిభను చాటారని స్కూల్ చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్‌రావు తెలిపారు. డి.అక్బర్‌ఆలీ, పి.హన్విత, షణ్ముఖి జిల్లా జట్టులో స్థానం దక్కించుకున్నారని చెప్పారు. వీరు ఈనెల 22, 23 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో డి.అక్బర్ ఆలీ పాల్గొంటారని, 16న విజయవాడలోని గాంధీనగర్ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పి.హన్విత, షణ్ముఖి పాల్గొంటారని చెప్పారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి - కారంపూడి

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఎం.పద్మావతి సోమవారం తనిఖీ చేశారు. గర్భిణులు, శిశువుల నమోదు, వ్యాధి నిరోధక టీకాల లక్ష్యం, పిఎంజెఎవై కార్డ్స్ సర్వే, ఎన్‌సిడిసిడి సర్వే, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థుల ఆరోగ్య పరీక్షలపై వివరాలను పరిశీలించారు. స్థానిక వైద్యాధికారులు డాక్టర్ ఎం.రమ్య, డాక్టర్ కె.లక్ష్మీమౌనిక, సిహెచ్ఒ కె.మల్లయ్య ఉషారాణి, పద్మావతి, కె.శివశంకర్, వెంకటలక్ష్మి, ఆరోగ్య సహాయకులు ఎం.లాలు నాయక్, డి.రమాదేవి, ఆమని ధనలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.



నలుగురు విద్యార్థులు.. ఆరుగురు ఉపాధ్యాయులు

- రికార్డులు అప్పగించాలని ఆదేశించినా తాత్సారం
- యడ్లపాడు లూథరన్ పాఠశాలలో ఆర్‌జెడి తనిఖీలు

ప్రజాశక్తి - యడ్లపాడు



వివరాలు సేకరిస్తున్న ఆర్‌జెడి లింగేశ్వరరెడ్డి

మండల కేంద్రమైన యడ్లపాడులోని లూథరన్ ఉన్నత పాఠశాలను విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) బి.లింగేశ్వరరెడ్డి సోమవారం సందర్శించారు. గతంలో ఈ పాఠశాల మూసివేతకు ఉత్తర్వులు జారీ అయినప్పటికీ, రికార్డులు పూర్తిస్థాయిలో విద్యాశాఖకు అప్పగించకపోవడం, తిరిగి విద్యార్థులు ఉన్నారనే సమాచారం నేపథ్యంలో విద్యాసంస్థ నిర్వహణపై క్షేత్రస్థాయి విచారణకు వచ్చినట్లు ఆర్జేడీ తెలిపారు. ఎంఈవో ఎంవీ నాగరత్నంతో కలిసి విచారణకు వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలలో నలుగురు విద్యార్థులు ఉండగా, ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నట్లు గుర్తించామని, అదనపు ఉపాధ్యాయులను లూథరన్ సంస్థ పరిధిలోని ఇతర పాఠశాలల్లోనే సర్దుబాటు చేయాల్సి ఉందని చెప్పారు. అయితే ఆ దిశగా యాజమాన్యం చర్యలు తీసుకోలేదన్నారు. మూడేళ్ల నుంచి హైస్కూల్ విద్యార్థుల సంఖ్య తగ్గుతూ చివరకు జీరో హాజరు అని తెలియడంతో పాఠశాల మూసివేతకు ఉత్తర్వులు జారీ చేయడం చేశామన్నారు. పాఠశాల మూసివేతకు సంబంధించిన రికార్డులను జిల్లా విద్యాశాఖ అధికారికి (డీఈవో) అప్పగించాలని గతంలో ఉత్తర్వులిచ్చినా పూర్తి స్థాయిలో అప్పగించలేదని చెప్పారు. ప్రస్తుతం ఉన్న నలుగురు పిల్లలు ఎక్కడ నుంచి వస్తున్నారు, ఎప్పుడు వచ్చారనే విషయాలను ఆరా తీస్తామన్నారు. ఇక్కడున్న ఉపాధ్యాయులను త్వరలోనే మరోచోటకు బదిలీకి చేస్తామని చెప్పారు. 1952లో స్థానికుల స్థల వితరణ ద్వారా ఏర్పాటైన పాఠశాల నిర్వహణను స్థానికులు ఎఇఎల్‌సికి అప్పగించగా వారు సరిగా నిర్వహించడం లేదనే అంశమై సంస్థను స్థానికులు నిలదీశారు. పాఠశాలను నిర్వీర్యం చేశారని విద్యాశాఖాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీనిపై కొద్దికాలంగా విచారణలు, తనిఖీలు జరుగుతున్నాయి. అందులో భాగంగానే తాజాగా మరోసారి సందర్శనకు ఆర్‌డిఎ, ఎంఇఒ వచ్చి వివరాలు సేకరించారు.

7న సోవియట్ విప్లవ వార్షికోత్సవ సభ

ప్రజాశక్తి - మంగళగిరి

సోవియట్ విప్లవ వార్షికోత్సవం సందర్భంగా గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో పెట్టుబడిదారీ విధానం... భవిష్యత్తుపై జరిగే సభను జయప్రదం చేయాలని సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వి.వి.జవహర్‌లాల్ అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. జవహర్‌లాల్ మాట్లాడుతూ సోవియట్ యూనియన్‌లో 1917 నవంబర్ 7న విప్లవ ఉద్యమం జరిగి ప్రపంచంలో మొట్టమొదటి శ్రామిక వర్గ రాజ్యం అధికారంలోకి వచ్చిందని అన్నారు. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఎనిమిది గంటల పని దినం, ప్రజలకు ఉచిత విద్య, వైద్యం మౌలిక వసతులు కల్పించడం జరిగిందని అన్నారు. విప్లవ ఫలితంగా ప్రైవేట్ యూనియన్ లో ప్రజలకు అందాయని అన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా సోషలిజం వైపు కార్మిక వర్గం చూస్తుందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గుంటూరులో జరిగే సభకు మంగళగిరి ప్రాంతం నుండి పెద్ద ఎత్తున ప్రజల తరలిరావాలని కోరారు. సిపిఎం జిల్లా నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జె.వి.రాఘవులు, పి.బాలకృష్ణ, పట్టణ కమిటీ సభ్యులు ఎస్.గణేష్, నాయకులు ఎం.రాంబాబు, ప్రజానాట్యమండలి నాయకులు గాలి శ్రీనివాసరావు, కె.బుజ్జిబాబు, ఆర్.ప్రసన్న పాల్గొన్నారు.




మంగళగిరి, గుదిబండివారిపాలెంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కొల్లిపర

సోవియట్ యూనియన్ విప్లవ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 7వ తేదీన గుంటూరులో పెట్టుబడిదారీ విధానం భవిష్యత్తుపై జరిగే సభలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం తెనాలి రూరల్ కార్యదర్శి ములకా శివ సాంబిరెడ్డి కోరారు. సోమవారం గుదిబండి వారిపాలెం హౌసింగ్ కాలనీలో మహిళలతో కలసి ఆయన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సభలో ముఖ్య అతిథిగా సిపిఎం పోలీస్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబురావు శాసనమండలి మాజీ సభ్యులు కేఎస్ లక్ష్మణరావు సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ తదితరులు పాల్గొంటారని తెలిపారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

అర్హులకు నష్టపరిహారం అందజేయాలి

ప్రజాశక్తి- తాడేపల్లి

మొంథా తుపాను వల్ల నష్టపోయిన అర్హులైన ప్రతిఒక్కరికీ పరిహారం అందజేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు కోరారు. సిపిఎం తాడేపల్లి పట్టణ కమిటీ సమావేశం దొంతి రెడ్డి విజయ భాస్కర్ రెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తుఫాన్ బాధితులకు పట్టణంలో కొంతమందికి రూ.1000, మరి కొంతమందికి రూ.2000, ఇంకొందరికి రూ.3000 అందజేసినట్లు బాధితులు తమ దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. తుపాను వల్ల నష్టపోయిన పేదల్లో పేదలైన అందరికీ రూ.3000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, వాస్తవ లబ్ధిదారులను గుర్తించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

అక్టోబర్ విప్లవం సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- తాడేపల్లి

ఈనెల ఏడో తేదీన సిపిఎం జిల్లా కమిటీ గుంటూరులో జరిగే అక్టోబర్ విప్లవ వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం తాడేపల్లి మేక అమరారెడ్డి భవన్లో కరపత్రాలను ఆవిష్కరించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సోవియట్ విప్లవ వార్షికోత్సవం సందర్భంగా, పెట్టుబడిదారీ విధానం - భవిష్యత్తు అంశంపై సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1990లో సోవియట్ యూనియన్ లో సోషలిజం ఎదురు దెబ్బల తర్వాత, పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్నమయం లేదని పెద్ద ఎత్తున జరిగిన ప్రచారం నేడు పటాపంచలైందని చెప్పారు. పెట్టుబడిదారీ వ్యవస్థ నేడు సంక్షోభంలో కూరుకుపోయిన పరిస్థితిని చూస్తున్నామని వెల్లడించారు. సభను జయప్రదం చేయడానికి పట్నంలోని ఇది ప్రాంతాల నుండి బాధ్యుల నుండి వివరాలు తెలుసుకుని పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గాదె సుబ్బారెడ్డి, డి.వి.భాస్కర్ రెడ్డి, కోట బాబురావు, దర్శనపు విజయ్ బాబు, కట్ట మేరీ, విశాస్త్రి పాల్గొన్నారు.

మురుగు నీటి సమస్యను పరిష్కరిస్తాం..

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - తెనాలి

కొలకలూరులో వీధి కుక్కల స్వైర విహారం, మురుగు నీటిపారుదల అస్తవ్యస్తం - పట్టించుకోని కార్యదర్శి' శీర్షికన సోమవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు ఇన్‌చార్జి కార్యదర్శి, ఈఓపీఆర్డీ వై.వి.డి.ప్రసాద్ స్పందించారు. సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. సైడ్ కాలువలను పరిశీలించారు. సైడ్ కాల్వల్లో క్వారీ నిలువ నీరు ఇంజన్ల ద్వారా పంపించటం పల్ల ఎదురయ్యే ఇబ్బందులను స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. కొద్ది ప్రాంతాల్లోనే సైడ్ కాల్వలు లేవని, మిగిలిన ప్రాంతాల్లో మురుగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, పాలనాపరమైన అంశాలలో నిర్లక్ష్యం లేదని చెప్పారు.

కార్పెంటర్లకు రేపు వర్క్‌షాప్

ప్రజాశక్తి - గుంటూరు

స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో బుధవారం కార్పెంటర్లకు (మెషిన్‌పై చెక్క పని చేసేవారు) జీరో డిఫెక్ట్ జీరో ఎఫెక్ట్ (జెడ్)పై జిల్లా పరిశ్రమల కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతనెల 28న నిర్వహించాల్సిన వర్క్‌షాప్ తుపాను వలన వాయిదా వేసినట్లు తెలిపారు. వర్క్‌షాప్‌లో జీరో డిఫెక్ట్ జీరో ఎఫెక్ట్ (జెడ్) సర్టిఫికేషన్ పథకం, ఎంఎస్ఎంఈలకు లభించే ప్రయోజనాలు, జెడ్ రిజిస్ట్రేషన్, సర్టిఫికేషన్‌కు దశలవారీ మార్గదర్శకాలు, వ్యాపారవృద్ధి, ప్రపంచ గుర్తింపు అంశాలపై స్కిల్ ఎక్స్‌ప్రెస్ ఆధ్వర్యంలో ఆయా రంగాల నిపుణులు అవగాహన కల్గిస్తారన్నారు. కనుక నగరంలోని కార్పెంటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెదకాకాని

మండలంలో నెలకొని ఉన్న పలు ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలని తహశీల్దార్ పి.కృష్ణకాంత్‌కు సిపిఎం నేతలు సోమవారం ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ సర్వే నెంబరు 9051బి2 పల్లాలమ్మ చెరువు నీరు బయటకు పోవు మార్గము ఆక్రమణ తొలగించాలని, పల్లాలమ్మ చెరువు 48 ఎకరాల 50 సెంట్లు ఈ చెరువు వర్షం కురిసినప్పుడు చెరువు నిండి ఓవర్ ఫ్లో నీరు పోయేందుకు శంకర్ కంటి హాస్పటల్ ముందు నుండి కాలువ మార్గం ఉందని, ఈ మధ్యకాలంలో శంకర్ కంటి హాస్పటల్ వారు ఎన్ హెచ్ 16 నుండి శంకర్ కంటి హాస్పటల్ లోకి రావడానికి రోడ్డు నిర్మాణం చేస్తున్నారని, దీంతో చెరువులో నుండి నీళ్ల పోయే మార్గం మొత్తం పూడ్చి వేశారన్నారు. ఈ రోడ్డు నిర్మాణం తక్షణమే నిలుపుదల చేయాలని రోడ్డు వేయాలంటే, కాలువకి కల్వర్టు ఏర్పాటు చేయాలని, మండలంలో నంబూరు, వెనిగండ్ల, తంగెళ్లమూడి, అగతవరప్పాడు గ్రామాలలో అంగన్‌వాడీ స్కూల్స్ చుట్టూ ప్రహరీ గోడలు సెంటర్లకు ప్రహరీ గోడలు నిర్మించాలన్నారు.



శంకర ఆసుపత్రి వద్ద కాల్వను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం నాయకులు పి.కృష్ణమూర్తికి ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

విశ్రాంత ఆర్టీసీ కార్మికుల అసోసియేషన్ నాయకులు, సిపిఎం తెనాలి డివిజన్ మాజీ కమిటీ సభ్యులు పి.కృష్ణమూర్తి రెండవ వర్ధంతి సోమవారం ఘనంగా జరిగింది. విశ్రాంత ఆర్టీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.రవీంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సిపిఎం తెనాలి కమిటి కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్, షేక్ హుస్సేన్ వలి, పి జోనేష్ కె లక్ష్మణ్ రావు, ఎస్ సుబ్రమణ్యం, కె.దుర్గా ప్రసాద్, ఉమా మహేశ్వర రావుతో పాటు వారి కుటుంబ సభ్యులు ఆయనకు నివాళులు అర్పించారు. కృష్ణమూర్తి ఏ ఆశయం కోసం ప్రభుత్వ కొలువులో పనిచేశారో అదే లక్ష్యంతో విధులు నిర్వహించిన నాడే ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని వక్తలు అన్నారు.

దెబ్బతిన్న పైర్లను అధికారులు పరిశీలించాలని వినతి

ప్రజాశక్తి - తెనాలి రూరల్


రానున్న రోజుల్లో వ్యవసాయ రంగం జూదంగా మారనుందని, పెట్టిన పెట్టుబడి తిరిగి వస్తుందో లేదో అన్నట్లు రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. మొంథా తుపాను కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను వ్యవసాయ, రెవిన్యూ శాఖ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వాస్తవ సాగుదారులను గుర్తించి నష్టపరిహారం వెంటనే ప్రకటించాలని కోరుతూ సోమవారం తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రైతులతో కలసి వినతిపత్రం సమర్పించారు. తుపాను వీడి వారం గడుస్తున్నా దెబ్బతిన్న పంటల వివరాలు నమోదుచేయక పోవడం పలు అనుమనాలకు తావిస్తోందన్నారు. జరిగిన పంటనష్టాన్ని వ్యవసాయ శాఖ అధికారులు నమోదు చేయకపోవడం, పంట నష్టాన్ని అంచనావేయడానికి ఇప్పటివరకు ఏ అధికారి రాకపోవడంపై రైతులు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. అపరాలకు రూ.10 వేలు, వరి ఎకరాకు రూ.25 వేలు, అరటి, పసుపు పంటలకు రూ. 50 వేలు, ఉద్యానవన పంటలకు రూ.70 వేలు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు కౌలు కార్డులు ఇచ్చి వారికి బ్యాంకు రుణాలు పొందేలా చర్యలు తీసుకొని, రైతులకు ఇస్తానన్న పెట్టుబడి సాయాన్ని తక్షణమే ప్రకటించాలని కోరారు. పొలంలోకి అడుగుపెట్టిన అన్నదాత తాము పండిస్తున్న పంట ఆరోగ్యంగా ఉన్నప్పుడే సంతృప్తిగా ఉండగలమని యువ కౌలు రైతు వంపుగళ్ల సుమంత్ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దాది సూరయ్య, కె.వి.సత్యనారాయణ, తెనాలి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




సబ్ కలెక్టర్ సంజన సింహకు వినతిపత్రం సమర్పిస్తున్న సాంబిరెడ్డి, కౌలు రైతులు, తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొలకలూరు గ్రామ సమస్యలపై ఏకరవు

కొలకలూరుకు శాశ్వత పంచాయతీ కార్యదర్శిని నియమించాలని సిపిఎం తెనాలి రూరల్ కమిటి సోమవారం తహశీల్దార్ కె.వి. కెవి గోపాలకృష్ణకు వినతి పత్రం అందజేసింది. గ్రామంలో శునకాల బెడద నివారించాలని, దళిత వాడలో మురుగు కాల్వలు నిర్మించాలని, దోమలు ద్వారా సంక్రమించే అంటురోగాలను నివారించే విధంగా చర్యలు చేపట్టాలని సిపిఎం పార్టీ రూరల్ కార్యదర్శి ములకా శివ సాంబిరెడ్డి, ముద్దన సాంబశివరావు, ఎం.ఝాన్సీ లక్ష్మి వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వానికి నివేదించి చర్యలు తీసుకునే విధంగా కృషిచేస్తానని గోపాలకృష్ణ తెలిపారు.



ఆర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - గుంటూరు

ప్రజలు అందించే అర్జీలు పరిష్కారంలో విభాగాధిపతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం జిఎంసి ప్రధాన కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించి 39 అర్జీలు స్వీకరించారు. ఆయా అర్జీలను సంబంధిత విభాగాధికారులకు అందచేసి పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలన్నారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ఫోన్‌లో 25 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

లక్ష్యాన్ని సాధించండి

ప్రజాశక్తి - పెదకూరపాడు

లక్ష్యాన్ని సాధించే విధంగా ప్రతి విద్యార్థి చదువుకోవాలని మండల విద్యాధికారులు ప్రసాదరావు, సత్యనారాయణ కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు సిబ్బందికి వేరువేరుగా సమీక్ష సమావేశాలు నిర్వహించారు. విద్యార్థులు ఏరోజు వర్క్ అదే రోజు పూర్తి చేయాలన్నారు. క్రమశిక్షణతో మెలగాలన్నారు. పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు దృష్ట్యా ఎప్పటికప్పుడు సిలబస్‌ను నేర్చుకోవాలన్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థుల పట్ల వ్యక్తిగత శ్రద్ధను చూపాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రపంచ మహిళా కప్ విజేత భారత్

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

మన ఆతీవలు క్రికెట్‌ను అద్భుతంగా ఆడి వన్డేవరల్డ్ కప్‌ను మొదటిసారిగా కైవసం చేసుకుని విశ్వవిజేతలుగా నిలవటం దేశానికి గర్వకారణని లోక్‌జనశక్తి పార్టీ (రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షులు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. మనోధైర్యం, క్రమశిక్షణ, సంకల్పం, సమిష్టి కృషి ఉంటే మహిళలు ఎంతటి ఉన్నత శిఖరాన్నైనా అధిరోహిస్తూ దేశం గర్వించేలా ప్రతిభ కనపర్చవచ్చని చాటి చెప్పారని ఆయన కొనియాడారు. గతంలో రెండుసార్లు చేజారిన ప్రపంచకప్‌ను ఈసారి మన నారీ మణులు సాధించి చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయారని పేర్కొన్నారు. భారత మహిళాజట్టు, కోచ్‌బృందానికి, క్రికెట్ బోర్డు సభ్యులకు ఆయన శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షులు, కేంద్రమంత్రి. చిరాగ్‌పాశ్వన్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చందోలు సత్యనారా యణ భారత మహిళా క్రికెట్ జట్టుకు ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపినట్లుగా ఆయన పేర్కొన్నారు.

రోడ్డు పనులు పున:ప్రారంభం

ప్రజాశక్తి - బెల్లంకొండ

వైసిపి ప్రభుత్వ హయాంలో రూ.149 కోట్ల నాబార్డ్ నిధులతో ప్రారంభించిన అమరా వతి-బెల్లంకొండ రోడ్డు పనులు ఏడాదిన్నర కాలం తర్వాత ప్రారంభించడం శుభ పరిణామమని పెదకూరపాడు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో 70 కల్వర్టులు, రోడ్డు విస్తరణ, పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు నిర్మించారని తెలిపారు. త్వరిత గతిన రోడ్డును పనులు పూర్తి చేసి ఎన్నో ఏళ్ల నాటి నియోజకవర్గ ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని శంకరరావు కోరారు.



విద్యార్థిని తల్లిని కలిసిన ఉపాధ్యాయుడు

విద్యార్థులు గైర్హాజరు కావద్దు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

విద్యార్థులను పాఠశాలకు గైర్హాజరు కాకుండా పంపించాలని డైలీ డ్రాప్ ఔట్ డ్రైవ్‌లో భాగంగా చిలకలూరిపేట పట్టణం లోని 34వార్డు పోలిరెడ్డిపాలెం ఆవాసప్రాంతమైన పెద కొండ్రుపాడులో సోమవారం ఇంటింటికి వెళ్లి పిల్లల తల్లి దండ్రులకు అవగాహన కల్పించినట్లు పోలిరెడ్డి పాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె. హైమావతి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అందించే సౌకర్యాల గురించి వివరించామన్నారు. బడిఈడు పిల్లలను పనులకు పంపించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా ఐదు రోజులు కోడిగుడ్డు, మూడు రోజులు చిక్కి, మూడు రోజులు రాగిజావా, రోజు ప్రత్యేక మెనుతో అత్యంత పోషక విలువలు కలిగిన భోజనం అందిస్తు న్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలను పరిరక్షించుకోవడంలో తల్లిదండ్రులు, సామాజికవేత్తలు సహకరించాలని కోరారు. ఉపాధ్యాయులు పోటు శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలు

రెండు వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి - రాజుపాలెం

మండల కేంద్రం రాజుపాలెం గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న స్థానిక వైసిపి సర్పంచ్ పి.అశోక్‌కు చెందిన వాహనాలను పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఒక క్రేన్, ఒక ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ వేణుగోపాల్ తెలిపారు. కొండమోడు పేరేచర్ల నూతన జాతీయ రహదారి పనులు జరుగుతున్న నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను, కట్టడాలను ఇటీవల అధికారులు తొలగించారు. ఈ స్థలంలో ఉన్న మట్టిని సర్పంచ్ అనుచరులు తవ్వుకు పోతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ప్రభుత్వ స్థలంలో మట్టి తవ్వి



గ్రావెల్‌ను ట్రాక్టర్‌లోకి లోడ్ చేసిన అక్రమదారులు

వివిధ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం కోసం స్థలాలను మెరక చేసుకునేందుకు సరఫరా చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైసిపి హయంలో ఇదే రీతిలో అక్రమంగా గ్రావెల్ వ్యాపారం చేసిన నాయకులు కూటమి ప్రభుత్వ హయంలోనూ తమ దందాను కొనసాగిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఎట్టకేలకు పోలీసులు నియంత్రణ చర్యలు చేపట్టారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోండి

ప్రజాశక్తి - రెంటచింతల

చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, క్రీడాకారులు గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధనే ముఖ్యమని అన్నారు. మండల కేంద్రమైన రెంటచింతలలో గల సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ గోవిందు బాలస్వామి సోమవారం పాఠశాల అసెంబ్లీ సమావేశంలో మాట్లాడారు. గురజాల డివిజన్ స్థాయి నుంచి జిల్లా స్థాయికి పాఠశాల విద్యార్థులు ఆరుగురు ఎంపి కయ్యారు. అండర్ 14, 17 కేటగిరిలలో ఖోఖో ఆటలో మొత్తం ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. విద్యార్థులను పిఈటి సురేష్‌ను ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్, వి.శ్రీనివాస రావు ,ఫాతిమా మరెడ్డి, జైపాల్ రెడ్డి సుధాకర్ రెడ్డి సుధీర్ రెడ్డి టి.శ్రీనివాసరావు, పాపారావు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

హైప్రెజర్ క్లీనింగ్ బహూకరణ

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని 75త్యాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం గుత్తికొండ గురవారెడ్డి పాఠశాల పరిసరాల పరిశుభ్రతకు ఉపయోగపడే "హై ప్రెజర్ క్లీనింగ్ మిషన్"ను బహూకరించారు.'స్వచ్ఛ ఆంధ్ర' అవార్డుకు పాఠశాలల విభాగంలో జిల్లా స్థాయిలో ఎంపికై, అవార్డును అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని క్లీనర్‌ను పాఠశాలకు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎ.శ్రీనివాస రెడ్డి, ఎస్ఎంసి చైర్మన్ జీవి.హనుమంత రావు, మాజీ చైర్మన్ జి.శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం దాతకు ధన్యవాదాలు తెలిపారు.

జడ్పీ పాఠశాలకు ల్యాప్ ట్యాప్ బహూకరణ

ప్రజాశక్తి - రెంటచింతల

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ల్యాప్ ట్యాప్‌ను అందచేసినట్లు ఎంఎల్ఆర్ ఫౌండేషన్ కార్యదర్శి కళ్యాణ్ చెప్పారు. సోమవారం జడ్పీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి హెచ్ఎం సిలార్ అహ్మద్ అధ్యక్షత వహించారు. కళ్యాణ్ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఇప్పటి వరకు వివిధ పాఠశాలలకు 32 కంప్యూటర్లను ఉచితంగా అందచేశామని పేర్కొంటూ స్పోకెన్ ఇంగ్లీషులో ఉచితంగా తరగతులు నిర్వహిస్తు న్నామన్నారు. కార్యక్రమంలో శారద, టి.వెంకటేశ్వర్లు, సుభాషిణి, నాగరాజు, ఆంజనేయులు నాయక్, మాదవరావు పాల్గొన్నారు.

6న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - రెంటచింతల

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 6న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు చెప్పారు. అంచనా బడ్జెట్ ఆమోదంపై చర్చ జరుగుతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్ లు వివిధ శాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు సెయింట్ ఆన్స్ విద్యార్థులు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు మాచర్ల సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ఎంపికయ్యారు. రాష్ట్ర సాఫ్ట్‌బాల్ ఆర్గనైజర్ సెక్రెటరీ పి.నరసింహారెడ్డి పర్య వేక్షణలో 69వ ఎస్‌జిఎఫ్ స్కూల్ గేమ్స్, గుంటూరు జిల్లా సాఫ్ట్ బాల్ అండర్ 17, అండర్ 14 సెలక్షన్లు పల్నాడు జిల్లా రొంపిచర్ల జడ్పీ హైస్కూల్లో జరిగాయి. సాఫ్ట్‌బాల్ సెలక్షన్లకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి బాలుర విభా గంలో 150 మంది, బాలికల విభాగంలో 100మంది పాల్గొ న్నారు. అండర్ 17 విభాగంలో మాచర్ల సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ఎం.భూపేంద్రకుమార్, ఏ.అగస్త్య, టి.గణేష్, బాలికల అండర్ 17 విభాగంలో ఎం. విజయలక్ష్మి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం గ్రామంలో ఈనెల 20, 21, 22 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొంటారు. అండర్ 14 విభాగంలో ఇస్వంత్‌కుమార్, అజయ్ కుమార్ ఎంపికయ్యారు. వీరు ఈనెల 22, 23, 24, తేదీలలో పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సుజాత తదితరులు

పాల్గొంటారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్ తుమ్మ సుజాత ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సిస్టర్ శ్వేత, పిఇటి మత్తె సంతోష్ ప్రభుకుమార్, ఉపాధ్యాయుడు సంతోష్, రత్నప్రకాష్, వినేష్, వెంకట్, నాగేశ్వరావు, ప్రతాప్, శౌరిరాజు, వరప్రసాద్, కిరణ్, మధురవాణి, అనూష, సబిత, వర్జినికుమారి, మెర్సీరోస్ శ్రీదేవి విద్యార్థులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట పట్టణంలో అర్ధశతాబ్ది కాలానికి పైగా జిల్లాలోని వివిధ తండాల నుండి జీవనాధారం కోసం వలస వచ్చి సాంబశివ నగర్‌లో స్థిర నివాసం ఏర్పరచుకున్న 10 వేల మందికి పైగా షెడ్యూల్డ్ తెగలకు చెందిన సుగాలీలకు కనీస అవసరమైన ప్రత్యేక శ్మశాన స్థలాన్ని కేటాయించాలని చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం.రాధాకృష్ణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.ప్రసన్న రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సోమవారం డిప్యూటీ తహశీల్దార్‌కి వినతిపత్రం సమర్పించారు. మానవుని కనీస అవసరాలలో ఒకటైన శ్మశానం లేక నిరుపేద సుగాలీలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారినా సుగాలీల సమస్య పరిష్కారం కావటం లేదన్నారు. వారికి స్థలం కేటాయించేంత వరకు దశలవారీ పోరాటాన్ని చేస్తామన్నారు. రిటైర్డ్ హవల్దార్ మేజర్ కేతావతు మంత్రు నాయక్, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ విభాగం నాయకులు కేతావతు సాంబ శివనాయక్, కేతావత్ భీమానాయక్, జిల్లా యువజన కాం గ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇంటూరి భవానీ వెంకటేష్ నియో జకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె. స్వప్నకుమార్, మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు షేక్ ఖాజాబుడే పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి

రైతుకు వంద శాతం సబ్సిడీ ఇవ్వండి

ప్రజాశక్తి - మాచర్ల

రైతుల పరిస్థితి దారుణంగా పడిపోతుందని, అతివృష్టి, అనావృష్టి కారణాలతో పంటకు పెట్టిన పెట్టుబడి తిరిగిరాక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఐదెకరాల లోపు వున్న రైతులకు వంద శాతం సబ్సిడీ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయానికి కావలసిన పరికరాలు వంద శాతం రైతులకు సబ్సిడీ ఇవ్వాలని, పండిన పంటను రైతుల నుంచి గిట్టుబాటు ధరతో పూర్తిగా ప్రభుత్వాలే కొనుగోలు చేయాలన్నారు. లేకుంటే రాబోయే రోజుల్లో వ్యవసాయం చేసే వారు ఎవరూ ఉండరని, 20ఏళ్లలో ఆహారం కోసం ప్రజలు దోపిడీలు, కొట్లాటలు చేసుకునే పరిస్థితి వస్తుందన్నారు. రైతులకు ఆదుకునే చర్యలు ప్రభుత్వాలు చేపట్టాలన్నారు. జిల్లా కార్యదర్శి రాగిడి ప్రతాప్‌బాబు, మండలపార్టీ అధ్యక్షులు దొడ్డా శ్రీనివాసరావు, గాదె పుల్లా రెడ్డి, బ్రహ్మారెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు కొమ్ముకోటేశ్వరావు, సి.రామారావు పాల్గొన్నారు.

బీడు భూముల్లో ప్రశుగ్రాసాన్ని పెంచండి

ప్రజాశక్తి - మాచర్ల

ప్రభుత్వం యానిమల్ ప్రొటెక్షన్ యాక్టు సరిగా ఇంప్లిమెంటేషన్ చేయటం లేదని, పశువులు, జీవాల మేత కోసం బీడు భూముల్లో పశుగ్రాసాన్ని పెంచాలని బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇంచార్జ్ గుండాల సైదులు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాల యంలో వినతిపత్రం అందించిన అనంతరం సైదులు యాదవ్ మాట్లాడుతూ చింతల తండాలో గొర్రెల కాపరి హత్య ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే జరిగిందన్నారు. పశువులను మేపేందుకు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, దీనికి కారణం ప్రభుత్వాలేనన్నారు. నాగులవరం, సుబ్బారెడ్డిపాలెం వంటి గ్రామాలలో యాదవులు గొర్రెలు, పశువులను అమ్ముకుని పనులు చేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం స్పందించి గ్రామాలలో పశుసంపద వృద్ధిపై దృష్టి సారించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్షులు పఠాన్ జానీబాషా, ప్రధాన కార్యదర్శి మాచర్ల రామారావు బిఎస్‌పి కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయ మనుగడ కోసమే ప్రేమ

ప్రజాశక్తి - అమరావతి

రాజకీయ మనుగడ కోసమే మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నియోజకవర్గంపై ప్రేమ నటిస్తున్నారని, అందులో భాగంగానే అమరావతి మండలంలో నామ మాత్రంగా తిరిగి వెళ్లారని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకి లేదన్నారు. 2019-24 ఎమ్మెల్యేగా ఉన్న శంకరరావు నియోజకవర్గాన్ని గాలికి వదిలేశారన్నారు. వైసిపి ప్రభుత్వం నియోజకవర్గంలో కొన్ని అభివృద్ధి పనులను ప్రారంభించి వదిలేసిందన్నారు. అధికారులు తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటపొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేస్తున్నారన్నారు. రాజకీయ మనుగడ కోసం ప్రజలను ప్రక్కదారి పట్టించాలని చూస్తే ఊరుకోమని ఎమ్మెల్యే హెచ్చరించారు.

గిరిజన ప్రజలను ఆదుకోండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

బిర్సా ముండా జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఈనెల ఒకటి నుంచి గిరిజన పాఠశాల, కళాశాలల్లో 15 రోజులపాటు జన్ జాతీయ గౌరవ్ దివస్ అనే నామ కరణంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తుందని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. జాతీయ గిరిజన స్వాతంత్ర్య సమరయోధులు బిర్సా ముండా లాంటి మహోన్నతమైన వ్యక్తి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వసతులు, సరైన రోడ్లు లేక ఈనాటికీ డోలి పద్ధతినే అవలంబిస్తున్న గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. ఆర్థికంగా గిరిజనులను అభివృద్ధి చేసేం దుకు కేంద్ర ప్రభుత్వం రూ.5లక్షలు సబ్సిడీతో కూడిన రుణాలు అంద జేయాలన్నారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు మధుసూదనరావు

వడ్డేశ్వరంలో అన్నదానం

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో గ్యార్మీ పండుగ సందర్భంగా మాబు సుభాని కమిటీ ఆధ్వర్యంలో, ఐటీ విద్యాశాఖ రాష్ట్ర మంత్రి నారా లోకేష్, టిడిపి సీనియర్ నాయకులు గ్రామ అభివృద్ధి ప్రదాత కాట్రగడ్డ మధుసూదన్ రావు సహకారంతో, ఆదివారం 4000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ నాగూర్, పటాన్ సుభాని, షేక్ ఇమాంషా, షేక్ మస్తాన్, కొడవటి సురేష్, షేక్ అబ్దుల్ గఫూర్, వడ్డేశ్వరం ప్రసాద్, షేక్ జాకీర్, మాబు సుభాని కమిటీ, ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వెలగపాటి విలియం మృతికి సంతాపం

ప్రజాశక్తి- తాడేపల్లి

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి విధేయుడుగా ఉన్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మంగళగిరి పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎక్కువ కాలం పని చేసి అందరి మన్ననలు పొందిన వెలగపాటి విలియం మృతికి ఎన్టీఆర్ అభిమాన సంఘాల జాతీయ అధ్యక్షులు పాలెపు రామారావు సోమవారం సంతాపం తెలియజేశారు. ప్రస్తుతం మంగళగిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధిగా ఉన్న విలియం మఅతి బాధాకరమన్నారు. ఆయన మృతికి రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర మహమ్మద్ ఇబ్రహీం, సీనియర్ పాత్రికేయులు పాతర్ల రమేష్ సంతాపం తెలియజేసి, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

గ్రీవెన్స్‌కు ఒక అర్జీ

ప్రజాశక్తి - చేబ్రోలు

స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో ఒక్క వినతి మాత్రమే అందిందని తహశీల్వార్ కె.శ్రీనివాస శర్మ తెలిపారు. ఆయన పూర్తి స్థాయిలో సమస్యను పరిశీలించి నిర్ణీత గడువు లోపు పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.ఊహారాణి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



విద్యా సామగ్రి అందజేస్తున్న కెఎల్‌యు విద్యార్థులు

నిత్యావసరాలు, విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

దానోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎంటిఎంసీ పరిధిలోని గుండిమెడ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు నిత్యవసరాలను పంపిణీ చేసినట్లు కెఎల్ యూనివర్శిటీ స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్.ప్రసాద్ తెలిపారు. యూనివర్శిటీలోని ఎన్ఎస్ఎస్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని అధ్యాపకులు, విద్యార్థులు కలిసి రాత పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, రబ్బరు, షార్‌నర్, బిస్కెట్స్ పంపిణీ చేసినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.రమేష్ కుమార్ తెలిపారు. చినకాకానీ గ్రామంలోని షైన్ అనాధాశ్రమంలోని పిల్లలకు బియ్యం, పప్పుదినుసులు, నూనె, సబ్బులు తదితర అన్ని రకాల నిత్యావసరాలను పంపిణీ చేసినట్లు సీఎస్ ఈ-2, 4 ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ సీహెచ్.నాగమణి, డాక్టర్ జి.మోహనరావు తెలిపారు. అనంతరం తాడేపల్లిలో "సర్దార్" జయంతి సందర్భ ంగా ర్యాలీ నిర్వహించినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సేవా కార్యక్రమంలో పాల్గొని అధ్యాపకులు, వాలంటీర్లను యూనివర్శిటీ వీసీ డాక్టర్ జి.పార్ధ సారధివర్మ, ప్రోవీసీలు డాక్టర్ ఏవీఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రావు, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాజేష్, డీన్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లాఖాన్, విభాగాధిపతులు డాక్టర్ టి.విజయ్ కుమార్, డాక్టర్ బి.తిరుపతిరెడ్డి, డాక్టర్ టి.పవన్ కుమార్, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

మద్యం షాపులకు విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వొద్దు

గ్రీవెన్స్‌లో రైతుల వినతి



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు, పరిసర ప్రాంతాలలో విచ్చలవిడి మద్యం షాపుల ఏర్పాటు వల్ల మహిళలు, రైతులు , యాత్రికులు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్నారని, మద్యం షాపుల అనుమతులను నిలిపివేయాలని సోమవారం జరిగిన స్పందనలో రైతులు వినతి పత్రం అందజేశారు. పొన్నూరు మున్సిపల్ శివారులో నివసిస్తున్న 1, 2, 3, 30, 31వ వార్డుల కట్టెంపూడి, తాళ్లపాలెం గ్రామముల తాలూకు వ్యవసాయ రైతులు, ప్రజలు, పొలిమేర డొంక ఇరువైపులా వ్యవసాయ భూములు ఉన్న రైతులు వేడుకొన్నారు. ములుకుదురు గ్రామంలో నిర్వహిస్తున్న మద్యం షాపును పొన్నూరు పట్టణ శివారులోని జి.బి.సి. రోడ్డుకు ఆనుకొని వున్న పొలిమేర దొంక ప్రైవేట్ స్థలంలోనికి తరలించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారని, నూతనంగా వైన్ షాపు ఏర్పాటు చేసే ప్రాంతానికి సమీపములోనే వినాయకుని దేవస్థానం, రైస్ మిల్లు, గ్రోమోరో గోడౌన్, కుమార్ రైస్ మిల్లు గోడౌన్‌లు ఉన్నాయని, వందలాది ఎకరాల సాగు భూములకు వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు ఈ మార్గం నుండే రాకపోకలు సాగిస్తున్నారు. తాగుబోతుల సంచారంతో ఆ ప్రాంతం ఆసాంఘీక కార్యకలాపాలకు నిలయమెంది. దీంతో రైతు కూలీలు, రైతులు, వ్యవసాయ మహిళ కూలీలు భయాందోళన చెందుతున్నారు. వైన్ షాపు ఏర్పాటు పట్ల తీవ్ర అభ్యంతరం తెలుపుతున్నారు. వైన్ షాపును మరొక నిర్జీవ ప్రదేశానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయమై గత నెల 13న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయగా 15న సమస్యను పరిష్కరించినట్లు పొన్నూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ అధికారులు తెలిపారు. అయినా మరలా ఆ ప్రాంతంలోనే వైన్ షాపును ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారని, తమ అభ్యంతరాలు తీసుకుని ఏర్పాటును ఆపాలని కోరారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని వారు కోరారు.

అరవిందలో ఏపీ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐ ఓ టీ) వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ సహకారంతో ప్రారంభించిన 'ఏపీ-మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్' ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి అరవింద పాఠశాలలో సోమవారం ప్రారంభమైంది. రోజుకు 20 మంది విద్యార్థులతో కూడిన నాలుగు బ్యాచ్‌లకు ఇంటలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటి) వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో మొదలైన ఈ కార్యక్రములో అరవింద పాఠశాల విద్యార్థులు భాగం అవ్వడం ఆనందకరమైన విషయం. అరవింద పిల్లలు రోజుకు 20 మంది విద్యార్థులతో బ్యాచ్‌ల వారీగా శిక్షణ తీసుకుంటున్నారు. ఏపీ మేకర్ లాబ్స్ ఆన్ వీల్స్ ని ఈ సందర్భంగా సందర్శించిన అరవింద పాఠశాల ప్రిన్సిపాల్ బి.ఇంద్రాణి, చాగంటి అరవింద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఇన్‌ఫోసిస్ సంయుక్తంగా పరివర్తనాత్మక నైపుణ్య అవకాశాలను నేరుగా విద్యార్థుల వద్దకే తీసుకురావడం అభినందనీయమని అన్నారు.

జనవాణిలో అర్జీలు స్వీకరణ..

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన జనవాణి కార్యక్రమంలో ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన సమస్యలపై స్పందిస్తూ ఆయా జిల్లాల అధికార ప్రతినిధులతో చర్చించి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ప్రోగ్రాం కమిటీ చైర్మన్ కళ్యాణం శ్రీనివాస్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ మాదిగ వెల్ఫేర్ - కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ బేతపూడి శేఖర్, లీగల్ సెల్ ప్రతినిధి కోటేశ్వరావు, ఎంటిఎంసి జనసేన పార్టీ కమిటీ అధ్యక్షులు మునగపాటి వెంకట మారుతీరావు, జనసేన సీనియర్ నాయకులు తిరుమలశెట్టి కొండలరావు, జనసేన పార్టీ నాయకురాలు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న చిల్లపల్లి శ్రీనివాసరావు

జీవితాలను నాశం చేస్తున్న డ్రగ్స్, మద్యం



మాట్లాడుతున్న గుంటూరు ఈగల్ సెల్ సబ్ ఇన్‌స్పెక్టర్ సునీల్ బాబు

ప్రజాశక్తి - మంగళగిరి

డ్రగ్స్, మద్యం తాత్కాలిక ఆనందం లాగానే కనిపిస్తాయని, కానీ జీవితాలను నాశనం చేసే శక్తి వాటిలో దాగి ఉందని సమస్య ఏదైనా ధైర్యంగా ఎదుర్కోవాలని గుంటూరు ఈగల్ సెల్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సునీల్ బాబు చెప్పారు. ఎవరైనా వ్యసనాల నుండి బయట పడటానికి సహాయం కోసం టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ 1972 నెంబర్ కు సంప్రదించాలని వారు అన్నారు. స్థానిక నిర్మల ఫార్మసీ కళాశాల జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం సోమవారం మూడో రోజుకు చేరుకుంది. మూడోరోజు డ్రగ్స్ పై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గుంటూరు ఈగల్ సెల్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సునీల్ బాబు మాట్లాడుతూ డ్రగ్స్, మద్యం అలవాట్లకు విద్యార్థిని విద్యార్థులు దూరంగా ఉంటూ వాటి వల్ల వచ్చే అనర్థాలు ఆరోగ్య సమస్యలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని చెప్పారు. మీరు నివసించే ప్రాంతాలలో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించినా, విక్రయించినా వెంటనే టోల్ ఫ్రీ హెల్ప్ లైన్‌కు సమాచారం అందించాలన్నారు. సమాచారం తెలిపిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని, తద్వారా గంజాయి రహిత నగరంగా తీర్చిదిద్దంలో మీరు భాగస్వాములు అవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ నవజీవన బాల భవన్ విజయవాడ జి శేఖర్ బాబు, ఎం సుమతి, సిహెచ్.సాయి బాబు, బి.సురేష్, జి.శేఖర్ బాబు, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రేఖ నరేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

335వ రోజుకు కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

చట్టపరంగా తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీకార్మికులు చేస్తున్న దీక్షలు 335వ రోజుకి చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నాయకులు కేస్టీవెన్, బి.అంకయ్య, వైసాంబశివరావు, నాగేశ్వరావు, ఎంగురవయ్య ప్రారంభించారు. దీక్షల్లో షేక్ ఇమాంబి, ఈ. శారమ్మ, వై.రమాదేవి, టి.దుర్గాభవాని, వి.రిబ్కా కూర్చున్నారు. కార్మికుల దీక్షల్లో మహిళల పాత్ర చాలా ఉన్నతమైనదని, కార్మికుల ఎన్ని కష్టలైన న్యాయం కోసం నిలబడుతున్నారని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో పిచ్చయ్య, శారదా, డి.నాగేశ్వరావు, సువర్ణ, శివమ్మ, రమణమ్మ, ఆశీర్వాదం, రహీముల్లా, ఇశ్రాయిల్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కెఎల్‌యులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్‌యులో ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బోర్డు సభ్యులు, కోశాధికారి కలగర నాగలింగేశ్వరరావు స్మారకార్థం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో గుంటూరుకు చెందిన కిమ్స్ శిఖర, కిమ్స్ చక్ర ఆసుపత్రుల పాల్గొని వర్శిటీలోని ఆచార్యులకు, సిబ్బందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రక్త పరీక్షలు, హిమోగ్లోబిన్ పరీక్ష, 2డి ఎకో, మామోగ్రఫీ తదితర పరీక్షలు నిర్వహించారు. సమారు 500 మంది వైద్య శిభిరంలో పాల్గొన్నట్లు ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూత్ రమ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కెఎల్ఇఫ్ కార్యదర్శి కోనేరు శివకాంచనలత, విసి డాక్టర్ జి.పార్థసారథివర్మ, డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖర రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూత్ రమ్య, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, డాక్టర్ సుధాకర్ రాజు, విజయరత్నం, తదితరులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న ఏవో సుబ్రహ్మణ్యం

నిబంధనల ప్రకారమే పంట నష్టం నమోదు

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలో తుపాను ప్రభావంతో నష్టపోయిన పంటలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టాన్ని నమోదు చేస్తామని మండల వ్యవసాయ అధికారి ఐ.సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని వరి పంట పొలాలను పరిశీలించారు. 66 శాతం పంట దెబ్బతింటేనే నష్టాన్ని నమోదు చేయమని మార్గదర్శకాలు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు మండలంలో 55 మంది రైతులకు సంబంధించి 90 ఎకరాలలో పంట నష్టాన్ని నమోదు చేసినట్లు తెలిపారు. నిబంధనలు సడలించి పరిహారం ఇవ్వాలని రైతు సంఘం నాయకులు, రైతులు కోరుతున్నారు.

కిట్స్‌లో ప్రాంగణ ఎంపికలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఇన్ఫో సిస్, అపిటా వారి సౌజన్యంతో ఈ నెల 8వ తేదీ వరకూ నిర్వహించనున్న ప్రాంగణ ఎంపికలు సోమ వారం ప్రారంభం అయ్యాయి. ఈ ప్రాంగణ ఎంపికలకు కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకి చెందిన 75 ఇంజనీరింగ్ కళాశాలల నుండి పెద్ద సంఖ్యలో విద్యార్థి నులు హాజరయ్యారు. మొదటిరోజు 2075 మంది విద్యార్థినులు రాత పరీక్ష రాశారు. రాత పరీక్షల్లో ఎంపికైన వారికి 5 నుండి మౌఖిక పరీక్షలు నిర్వహిస్తారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 20 లక్షల ఉద్యోగాల సంకల్పంలో భాగంగా యువత అందరికీ ఉపాధి కల్పనే లక్ష్యంగా ఆంధ్ర ప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ బహుళజాతి కంపెనీలను ఆహ్వానించి ఎంపికలను నిర్వహిస్తుందని కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. ఈ ఎంపికలకు 13655 మంది విద్యార్థినులు నమోదు చేసుకున్నారన్నారు. ఇంటర్యూలో ప్రతిభ చూపిన వారికి ఇన్ఫోసిస్ మంచి వేతనంతో కూడిన ఉపాధి కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె. హరిబాబు, అపిటా ప్రతినిధిలు రోషిరెడ్డి, సత్యరత్నం, ఇన్ఫోసిస్ ప్రతినిధిలు సుమేధ, దిశా, కిట్స్ ఉపాధి కల్పనాధికారి సిహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధులు

కాంట్రాక్టు ఎఎన్ఎంలను కొనసాగించాలి

ప్రజాశక్తి-గుంటూరు

గతంలో రెండు దశాబ్దాల పాటు అర్బన్‌హెల్త్ సెంటర్లలో కాంట్రాక్ట్ ఏఎన్ఎంలుగా పని చేసి తదుపరి అన్యాయంగా తొల గించ బడిన వారిని హైకోర్టు ఉత్తర్వుల మేరకు తిరిగి కొనసాగించాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు ఏఎన్ఎం లతో కలిసి గుంటూరు డిఎంహెచ్ఓ డాక్టర్ విజయ లక్ష్మికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పట్టణ ప్రాంతాలలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లలో దాదాపు రెండు దశాబ్దాలపాటు ఏఎన్ఎంలు కాంట్రాక్టు పద్ధతిపై అతి తక్కువ వేతనంతో పని చేశారన్నారు. అనేక సందర్భాలలో యాజమాన్యాలు మారుతూ వచ్చినా ఉద్యోగుల పోరాటాల ఫలితంగా ప్రభుత్వాలు వారిని నిరవధికంగా కొనసాగిస్తూ వచ్చాయన్నారు. 2022లో నాటి వైసిపి ప్రభుత్వ హయాంలో అర్బన్ హెల్త్‌సెంటర్ల స్టాఫ్ పాటర్న్ మార్పు చేసి అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు అందర్నీ ప్రభుత్వం తొలగించిందన్నారు. ప్రత్యామ్నాయంగా మరోచోట ఉద్యోగాలు కొనసాగించాలని కోరుతూ ఏఎన్ఎంలు పదేపదే అధికారులకు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పెడచెవిన పెడుతుందన్నారు. ఏఎన్ఎంలు తదుపరి ప్రయత్నంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారని, హైకోర్టు 2025 అక్టోబర్ 15లోగా పిటిషన్ దారులుగా ఉన్న సొంగ బసవదేవి, జూగంటి రమాదేవి, వీర్నపు నాగేంద్రమ్మ, మంటిరోజు మేరీ, పెదపూడి లేయమ్మా, మన్యం మాణిక్యం తదితరులను కాంట్రాక్టు ఏఎన్ఎంలుగా 8 వారాలలోగా సర్వీసులోకి తీసుకొని కొనసాగించాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వుల మేరకు ఏఎన్ఎం లందరినీ వెంటనే సర్వీసులోకి తీసుకోవాలని కోరారు. డిఎంహెచ్ఓ కే విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర అధికారుల సలహా మేరకు తదుపరి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.బసవదేవి, జె.రమాదేవి, ఎం.మాణిక్యం, ఎం శిరోమణి పాల్గొన్నారు.


డిఎంహెచ్ఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

2025 అక్టోబర్ 17వ తేదీన సిపిఎం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల సమస్యలపై మంగళగిరి నియోజ కవర్గం లోని తాడేపల్లి టౌను, తాడేపల్లి రూరల్, మంగళగిరి టౌను, మంగళ గిరి రూరల్, రాజ ధాని గ్రామాలకు సంబంధిం చిన ప్రజలు ఇళ్ల స్థలాల సమస్యలపై అధికారులకు అర్జీలు ఇవ్వడం జరిగిందనీ వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు సోమవారం సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. మంగళగిరి రెవెన్యూ మున్సిపల్ అధికారులకు ఇళ్ల స్థలాల దరఖాస్తులు సమర్పించడం జరిగిందని కానీ వాటికి సంబంధించి రసీదులు ఇవ్వలేదని కలెక్టర్‌కు నేతలు వివరించారు. మంగళగిరి ఎమ్మార్వోను కలిసి అర్జీలు ఇవ్వడానికి వెళ్లిన సందర్భంగా ఎమ్మార్వో ఇవి నాకు కాదు మున్సిపల్ కమిషనర్ ఇవ్వండి నాకు ఎలాంటి అధికారాలు లేవు అని ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారని ఈ క్రమంలో కార్పొరేషన్ లో విలీన గ్రామాల ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవించుకోవాలంటే ఎవరికి చెప్పాలో తెలియడం లేదనీ చెప్పారు. మీరు జోక్యం చేసుకొని ఈ సమస్యను పరిష్కారం చేయవలసినదిగా జిల్లా కలెక్టర్ ను కోరారు. అలాగే ఇళ్ల స్థలాల సమస్యపై ఇచ్చిన అర్జీలకు రసీదులు ఇప్పించవలసిందిగా గుంటూరు జిల్లా గ్రీవెన్స్ లో అర్జీ అందించగా దీనికి అధికారులు స్పందించి మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ కమిషనర్ కు, ఎమ్మార్వో కు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. వెంటనే అర్జీ దారులకు రశీదు ఇవ్వాలని ఆదేశించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు, ఈమని అప్పారావు, మంగళగిరి మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు, గడ్డం అజయ్ కుమార్ గోపాలరెడ్డి ప్రకాశరావు పున్నయ్య పాల్గొన్నారు.



కలెక్టర్ గ్రీవెన్స్‌కు భారీగా అర్జీలు

సమస్యలు పరిష్కరించాలని ప్రజాసంఘాల వినతులు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం 409 వినతులు అందాయి. కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి తదితరులతో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల సంతృప్తి మేరకు ఆర్జీల పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గుంటూరు నగరంలో ఉన్న రత్నాపూర్ కాలనీకి కనీస మౌలిక వసతులు కల్పించాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. తెనాలి మండలం కొలకలూరు గ్రామంలో సర్వే నెం. 608లో ప్రభుత్వ భూమిలో మేజరు చెరువు ఉందని, ఈ చెరువుకు ప్రతి ఏటా బహిరంగ వేలంపాట నిర్వహించాలని, పంచాయతీ ఆదాయం పెంచడమే కాకుండా ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన గంపల నాగరాజు ఆర్జీ ఇచ్చాడు. షుగర్ వ్యాధి వల్ల 2023 సంవత్సరంలో ఒక కాలు తొలగించారని, సదరం సర్టిఫికెట్ తీసుకొని దివ్యాంగుల పెన్షన్ కోసం 2024లో వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసినా ఇప్పటి వరకు నాకు పెన్షన్ మంజూరు కాలేదని గుంటూరు ఆదర్శనగర్‌కు చెందిన సానికొమ్ము కొండారెడ్డి అర్జీ అందచేశాడు. నా కుమారుడు ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, న్యాయం చేయాలని ఎంటిఎంసి బ్రహ్మానందపురంలో నివాస ఉంటున్న సిరిపల్లె అంకమ్మ తెలిపారు. కొడుకు కోడలు నన్ను సరిగా పట్టించుకోకపోవటంతో కుమార్తె వద్ద ఉంటున్నానని తెలిపారు.తనకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

వరద బాధిత కౌలు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

ఇటీవల వరదల్లో పంట నష్టపోయిన కౌలు రైతులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని, అన్నదాత సుఖీభవ కౌలురైతులకు కూడా వర్తింప చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు కోరారు. ఈ మేరకు సంఘం నాయకులు రైతులు గ్రీవెన్స్‌లో అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ 75శాతం భూమిని కౌలు రైతులే సాగుచేస్తున్నారని, పంట నష్టపరిహారం కౌలురైతులకే ఇవ్వాలని, యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఇటీవల సంభవించిన తుపానుకు రైతులు సర్వస్వం కొల్పో యారని ఎకరాకు వరికి రూ.20వేలు, మిర్చికి రూ.30వేలు, పత్తికి రూ.25వేలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. గుంటూరు ఛానల్ పోడిగింపు భూసేకరణకు రూ.120 కోట్లు ఒకేసారి కేటాయించి పనులు ప్రారంభించాలని, నల్లమడ ఆధునీకరణకు నిధులు కేటాయించాలని కోరారు. వరదలకు, తుపానుకు జిల్లాలో రోడ్లు అస్తవ్యస్థంగా వున్నాయని, డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిన్నదని, వెంటనే నిధులు కేటాయించి రిపేర్లు చేయించాలని, నల్లమడ, గుంటూరు ఛానల్‌కు పడిన గండ్లను యుద్ధప్రాతిపదికన రిపేర్లు చేయా లని కోరారు. దుగ్గిరాల మండలం పెద కొండూరు లంక భూములు సాగు చేసుకునే రైతులకు వ్యక్తిగత పట్టాలు ఇవ్వాలని కోరుతూ మరో అర్జీని అందచేశారు. ఈ కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.రామకృష్ణ, నాగమల్లేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం ఈమని అప్పా రావు, నాయకులు డి.రమేష్, దుర్గారావు, నీలాంబరం, బుల్లయ్య, జేమ్స్ పాల్గొన్నారు.



చట్ట ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలి..

గుంటూరు నుండి నడికుడి మీదుగా సికింద్రాబాద్ డబల్‌లైన్ ఏర్పాటు చేయడంలో భాగంగా మేడికొండూరు మండలం, సిరిపురం , మందపాడు గ్రామాల్లో ఇళ్లు, భూములు కోల్పోతున్న పేదలు, రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కోరారు. సోమవారం గ్రీవెన్స్ వద్ద నిరసన తెలిపి జాయింట్ కలెక్టర్‌కు అర్జీ అందచేశారు. సిరిపురంలో గత 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న పేదలకు ఇళ్లు తొలగించాలని నోటిఫికేషన్ ఇవ్వటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ఇళ్లు తొలగిస్తే ప్రత్యామ్నాయం లేదని, రోడ్డుమీదకు వస్తారన్నారు. అదే విధంగా దీర్ఘకాలంగా మందపాడు, సిరిపురం గ్రామాల్లో సాగు చేస్తున్న రైతులు రైల్వే లైన్ కింద 35 ఎకరాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. కావున పేదలకు, రైతులకు గ్రామ సభలు నిర్వహించి 2013 భూసేకరణ చట్టం ప్రకారం, రైతుల అంగీకారంతో అవార్డు ప్రకటించాల్సి ఉందన్నారు. కానీ గుంటూరు ఆర్డీఓ మండల కేంద్రమైన మేడికొండూరులో సమావేశం ఏర్పాటు చేసి, రైతుల్ని, పేదలను భయపెట్టే విధంగా, బలవంతంగా తీసుకుంటామని, మీ అనుమతితో సంబంధం లేదని ప్రకటించటం దుర్మార్గం అన్నారు. కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బొట్ల రామకృష్ణ మాట్లాడుతూ 2013 భూసేకరణ ప్రకారం గ్రామంలో అత్యధిక ధరతో రిజిస్ట్రేషన్ జరిగిన విలువను ప్రామాణికంగా తీసుకొని రెండున్నర రెట్లు ప్రకారం పరిహారం ఇవ్వాలని చట్టంలో ఉందని, కానీ అందుకు విరుద్ధంగా ఆర్డీఓ పాత రిజిస్ట్రేషన్ పరిగణనలోకి తీసుకొని తక్కువగా ప్రకటన చేయడం రైతులను మోసం చేయటమే అన్నారు. అదేవిధంగా సిరిపురంలో ఇల్లు కోల్పోతున్న పేదలకు స్థలంతోపాటు పక్క గహాలు నిర్మించి ఇవ్వాలన్నారు. లేని పక్షంలో న్యాయం జరిగేంత వరకు ఆందోళన చేస్తామని తెలిపారు.జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ నాలుగు రోజుల్లో రైల్వే అధికారులతో మాట్లాడి చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అర్జీ ఇచ్చిన వారిలో సూర్యదేవర వెంకటేశ్వరరావు, నర్రా మురళీకృష్ణ, కోట రమేష్, వెదల్లపల్లి వీరాంజనేయులు, కనకమెళ్ళ సూర్యనారాయణ ,అమర్ర శివప్రసాద్, ఇళ్లు కోల్పోయిన పేదలు ఉన్నారు.



ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లు నిర్మించాలి

మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ 3లో ఇళ్ళు కోల్పోయిన వారికి అధి.కారులు, ప్రజాప్రతినిధులు ఇళ్ళు నిర్మించి ఇస్తామన్న హామీ అమలు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. నళినీకాంత్ మాట్లాడుతూ ఇన్నర్ రింగ్‌రోడ్ ఫేజ్3 విస్తరణలో భాగంగా అడ్డుగా ఉన్న ఇళ్ల నిర్వాసితులకు స్థానిక ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, ఇతర ప్రభుత్వ అధికారులు ఇళ్లు తొలగించుకుంటే మూడు నెలల్లోగా పేరేచర్ల పిఎంఎవై-ఎన్‌టిఆర్ నగర్స్‌లో ఇంటిని నిర్మించి ఇస్తామని, మూడు నెలల అద్దె కూడా చెల్లిస్తుందని రూ.10వేలు ఇచ్చారని గుర్తు చేశారు. ఇళ్ళు కోల్పోతున్న ప్రజలను అధికారులు బస్సులు పెట్టి తీసుకెళ్లి పేరేచర్లలో పియంఎవై -ఎన్‌టిఆర్‌నగర్స్‌లో స్థలాలు కూడా చూపించారన్నారు. కానీ ఇళ్లు తొలగించి 5 నెలలు పూర్తయినా ఇప్పటివరకు ఎలాంటి నిర్మాణం ప్రారంభించలేదన్నారు. ప్రస్తుతం ఇళ్ళు కోల్పోయిన ప్రజలు అద్దెలకు ఉంటూ ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే ఇళ్ళు లేని పేదలకు పట్టణాలలో 2 సెంట్లు, గ్రామాలలో 3 సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఇళ్లు కోల్పోఇన వారికి వెంటనే రెండు సెంట్ల చొప్పున స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు షేక్ ఖాశిం షహీద్, ఆది నికల్సన్, షేక్.మస్తాన్‌వలి, బాధితులు ఎన్.నరసింహారావు, జి.లక్ష్మమ్మ, జి.సామ్రాజ్యం, ఎం. స్వాతి, పి.కాశమ్మ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో ఆగస్టు, జూలై లో జరిగిన పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్షలు నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాద్ తెలిపారు. నానో టెక్నాలజీ 4/4 రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను, జనవరిలో జరిగిన ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్ న్యూట్రిషన్ మొదటి సెమిస్టర్, జూలైలో జరిగిన ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ రెండవ సెమిస్టర్, ఎంబీఏ టిటి ఎం రెండవ సెమిస్టర్ ఫలితాలను, ఎంబీఏ మీడియా మేనేజ్మెంట్ ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంఏ ఆర్కియాలజీ రెండవ సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

పరీక్షల నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో డిసెంబర్ ఒకటవ తేదీ నుండి జరగనున్న బీపీఈడి, ఎంపీఈడి, డిపిఈడిల మూడో సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు సోమవారం పరీక్షల నిర్వహణ అధికారి ఆలపాటి శివప్రసాద్ తెలిపారు. 22వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని ఫైన్‌తో 22వ తేదీ వరకు చెల్లించాలన్నారు. మొత్తం పరీక్ష ఫీజు బిపిఈడి విద్యార్థులు రూ.1450 లు డిపిఈడి విద్యార్థులు రూ. 1090లు ఎంపీడీ విద్యార్థులు రూ.1540లు చెల్లించాలన్నారు.